# అధ్యాయము 1

# సృష్టి

సకల బ్రహ్మాండముగా కనబడు సృష్టి యొక్క విశ్వమంతటి మనోహరమైన మరియు విస్తృత దృష్టితో ఆదికాండము ఆరంభమవుతుంది. సార్వభౌముడైన సృష్టికర్త యొక్క స్వరము పలికినప్పుడు, ఒక వెలుగు యొక్క ప్రకాశము కటిక చీకటిని చొచ్చుకొని వెళ్ళి దానిని వెలుగునుండి వేరుపరచెను. ఒక పటముపై కళాఖండమును సృష్టిస్తున్న కళాకారుని వలె, రచయిత నేపథ్యములో విశ్వమును చిత్రీకరించెను. భూమిపై ఉన్న జలములు మరియు ఆకాశముపై జలములు వేరుపరచునట్లుగా ఒక విభజన జరిగెను. దీని తరువాత ఎండిన నెల కలుపుబడెను. ఇందులో విస్తారమైన మొక్కలు ఉండినవి. ఆకాశములలో, సూర్యుడు, చంద్రుడు, మరియు నక్షత్రములు, పగటిని రాత్రిని వేరుపరచుటకు మరియు కాలములను సంవత్సరములను నియంత్రించుటకు, వాటి వాటి స్థానములలో పెట్టబడ్డాయి.

ఈ అద్భుతమైన ఉత్కృష్టకార్యము ముందటివైపున, సృష్టిని గూర్చిన రచయిత యొక్క దర్శనము చిన్న వివరములపై కేంద్రీకరించబడెను. జలములను నిమ్ప్పుచున్న ప్రతి విధమైన సముద్ర జీవులను అతను చూపించెను, మరియు ఆకాశములో అనేకమైన పక్షులు ఎగురుచుండెను. ఎండిన నేలపై రచయిత/కళాకారుడు తన దృష్టిని కేంద్రీకరించినప్పుడు, ఖాళీ స్థలములను దేవుడు గొప్ప వైవిధ్యముతో కూడిన జీవముగల జంతువులను, అడవి జంతువులూ, పశువులు, మందలు, మరియు నేలను పరాకు ప్రతి పురుగును నింపుచుండిన విధానమును ధ్రువీకరించెను. అంతిమముగా, కేంద్ర స్థానములో, సృష్టికి అత్యున్నతమైనదిగా, దేవుడు తన పోలికలో ఒక జీవిని రూపించుటను రచయిత చిత్రించెను. ఈ జీవి ఒక మనుష్యుడు. ఇతను దేవుని పోలికలో రూపించబడెను. సృష్టికర్త ఇతనితో వ్యక్తిగత సంబంధమును కలిగియుండగలదు. ఇతర జీవులన్నిటికంటే ఇతనిని ప్రత్యేకపరచి, దేవుడు అద్భుతమైన సృష్టిపై ఆధిపత్యమును మరియు సంరక్షించే గొప్ప హక్కును, బాధ్యతను మనుష్యునికి యిచ్చెను.

ఆదికాండము మొదటి అధ్యాయములోని సృష్టి యొక్క ఈ దర్శనము అద్భుతమైనది మరియు ఉత్కంఠభరితమైనది. చదువరులు, సృష్టి యొక్క

సార్వభౌముడైన దేవుని యొక్క సృజనాత్మక మేథస్సు, జ్ఞానము మరియు శక్తులను బట్టి ఆయనకు అత్యున్నతమైన గౌరవము ఇచ్చునట్లు ఇది చేస్తుంది. లోకములను ఉనికిలోనికి తెచ్చుటకు దేవుడు కేవలము నోటి మాటను ఉపయోగించవలసివచ్చెను. ఇంట గొప్ప దేవుడు ఇంట సుందరమైన లోకమును బలహీనమైన మానవులు నివసించుటకు సృష్టించెను. మరియు అతడు పాపము చేసినా లేక తిరుగుబాటు చేసినా కూడా ఆయన మానవుని దీవించుటను కొనసాగిస్తూ సమస్తమును అనుగ్రహించుచున్నాడు. ఒకరు ఈ విషయమును గ్రహించినప్పుడు స్తుతి మరియు వినయము కలుగుతాయి. ఇటువంటి విస్మయముతో కూడిన భావము ఎనిమిదవ కీర్తనలో ప్రతిఫలించుచున్నది:

> నీ చేతిపనియైన నీ ఆకాశములను
> నీవు కలుగజేసినా చంద్రనక్షత్రములను నేను చూడగా
> నీవు మనుష్యుని జ్ఞాపకము చేసికొనుటకు వాడేపాటివాడు?
> నీవు నరపుత్రుని దర్శించుటకు వాడేపాటివాడు?
> దేవునికంటె వానిని కొంచెము తక్కువవానిగా చేసియున్నావు
> మహిమాప్రభావములతో వానికి కిరీటము ధరింపజేసియున్నావు.
> నీ చేతిపనులమీద వానికి అధికారమిచ్చియున్నావు.
> గొఱ్ఱలన్నిటిని, ఎడ్లన్నిటిని
> అడవి మృగములను ఆకాశపక్షులను సముద్ర మత్స్యములను
> సముద్రమార్గములలో సంచరించువాటినన్నిటిని వాని పాదముల క్రింద నీవు ఉంచి యున్నావు.
> యెహోవా మా ప్రభువా
> భూమియందంతటా నీ నామము ఎంత ప్రభావము గలది!
> (కీర్తన 8:3–9)

ఈ విశ్వము ఒక దైవిక సృష్టిగా మానవజాతి అర్థము చేసికొనవలెను కానీ, ఏదో యాదృచ్ఛికముగా అనుకోకుండా జరిగిన ఒక ప్రక్రియగా అర్థము చేసికొనకూడదాని కీర్తనా కారుడు కోరుకొనెను. ఆదికాండములో సృష్టిని గూర్చిన వృత్తాంతము క్రమముగా చెప్పబడినది. మరియు అది పునరావృతమయ్యే నమూనా కలిగి ఉంది. ఇది సమస్త వివరణకు ఒక సమతూలనాత్మకమైన నిర్మాణమును ఇస్తుంది. రచయిత కవిత్వము వ్రాయలేదు కానీ, ఒక సాధారణ హెబ్రీ సాహిత్య పద్ధతి అయిన రిపిటషన్ (పునరావృతము)ని ఉపయోగించి, సృష్టి యొక్క ఆరు రోజులను వివరించుచుండెను:

> ప్రతి దినము ఒక పరిచయముతో మొదలవుతుంది: "దేవుడు ... పలుకగా" (1:3, 6, 9, 14, 20, 24; 1:11, 26, 29 చూడుము).
> తరువాత ఒక దైవీకమైన ఆజ్ఞ ఇవ్వబడెను: "కమ్మని"; "ఒక చోటనే

కూర్చబడి ... కనబడును గాక"; "మొలిపించునుగాక" (1:3, 6, 9, 11, 14, 20, 24, 26).

అప్పుడు ఒక నివేదిక ఇవ్వబడుతుంది: "ఆ ప్రకారమాయెను" (1:7, 9, 11, 15, 24, 30).

సృష్టించబడినదాని గురించి ఒక అభిప్రాయము ఇవ్వబడెను, ఎట్లనగా, "అది మంచిదని దేవుడు చూచెను" (1:4, 10, 12, 18, 21, 25, 31).

అంతిమముగా, ఒక సమయ క్రమము ఇవ్వబడెను, ఎట్లనగా, "అస్తమయము" మరియు "ఉదయము" (1:5, 8, 13, 19, 23, 31).

దేవుడు తన సృష్టిని "మంచిది" అని ప్రకటించి, అది "చాలా మంచిది" అని ముగించినప్పుడు, దానికి సంబంధించిన హెబ్రీ పదమైన טוֹב (*tob*) ను, నైతికపరముగా "చెడ్డది" కాకుండా "మంచిది" అనే భావముతో వాడుటలేదు. దీనికి విరుద్ధముగా, ఇక్కడ వ్యక్తపరచబడిన భావము ఏదనగా, ప్రభువు తాను చేసినదానికి పూర్తి అంగీకారము తెలిపెను, ఏలయనగా, ఇది ఉండవలసిన విధముగానే ఉండినది, మరియు, సరిచేయవలసిన ఎటువంటి లోపములు కానీ మచ్చలు లానీ లేకయుండినది. సౌందర్యముతో కూడిన తన చేతి పనినంతటిని చూచి సంతోషించుటకు నైపుణ్యతగల చేతపనివానివలె దేవుడు ఒక అడుగు వెనక్కి వేసి ఆగినట్లుగానే ఉన్నది.

సృష్టిని గూర్చిన ఈ కథనము యొక్క మరియొక కవితాత్మకమైన లక్షణము ఏమిటంటే దాని యొక్క సమతల నిర్మాణం (symmetrical structure): భూమ్యాకాశముల సృష్టి, జీవములేని వస్తువులు మరియు జీవముగల సమస్త జంతురాశులతో కలిపి, మొత్తము ఆరు దినములలో ఉనికిలోనికి వచ్చాయి. మొదటి దినమున, వెలుగును మరియు చీకటిని వేరుపరచెను; మరియు నాలుగవ దినమున, సూర్యుడు, చంద్రుడు, మరియు నక్షత్రములను, పగలు మరియు రాత్రులను క్రమబద్ధముగా వేరుపరచు నిమిత్తము ఆకాశములలో ఉంచబడినవి. రెండవ దినమున పైని జలములను మరియు క్రింది జలములను వేరుపరచగా, అయిదవ దినమున, పైనున్న ఆకాశములు పక్షులతో నిండుకొనగా, క్రిందున్న జలములు సమస్త జీవులతో నిండుకొనెను. మూడవ దినమున ఆరిన నెల నుండి జలములు ("సముద్రములు") వేరుపరచబడి విత్తనములిచ్చు ఫలవృక్షములు మొలిపింపబడగా, ఆరవ దినమున దేవుడు భూమిని అన్ని విధములైన జంతువులతోను మరియు అంతిమముగా మానవజాతితోను నింపెను. ఆరంభములో ఉండిన అసంపూర్ణత సంపూర్ణతలోనికి తేబడినది; నిరాకారమునకు ఒక ఆకృతి ఇవ్వబడినది. ఏడవ దినమున దేవుడు

“విశ్రమించెను” అని చెప్పుటతో రచయిత ముగించెను (2:2, 3).

## సృష్టి యొక్క సమతుల్య నిర్మాణం (symmetrical structures)

అసంపూర్ణము మరియు నిరాకారము (1:2)—శూన్యము మరియు చీకటి

మొదటి దినము: చీకటి నుండి వెలుగు (వెలుగు సృష్టించబడుట మరియు చీకటి నుండి వేరుచేయ బడుట; 1:3–5)

నాలుగవ దినము: సూర్యుడు, చంద్రుడు, మరియు నక్షత్రము లు (పగలు మరియు రాత్రు లను ఏలుటకు; 1:14–19)

రెండవ దినము: జలము నుండి ఆకాశము (క్రింది జలముల నుండి మీద జలములు వేరుచే యబడుట; 1:6–8)

అయిదవ దినము: పక్షులు మరియు చేపలు (ఆకాశము మరియు జలములలో నివసించు టకు; 1:20–23)

మూడవ దినము: ఆరిన నేల నుండి సముద్రములు (ఫలవృక్ష ములను పుట్టించు నేలతో; 1:9–13)

ఆరవ దినము: జంతువులు మరియు మానవులు (నేలపై నివసించి మొక్కలను తినుట కు; 1:24–31)

ఏడవ దినము: సంపూర్ణము మరియు “చాలా మంచిది”—దేవుడు విశ్రమించెను (2:1–3)

సృష్టి వృత్తాంతము విశ్వముయొక్క క్రమమును మరియు దైవికమైన రూపకల్పనను చూపుతుంది; ఇది ఒక విశ్వము యొక్క ప్రమాదమో లేక వ్యక్తిత్వంతో సంబంధం లేని ప్రకృతి నియమము యొక్క ఫలితమో కాదు. దీనికి విరుద్ధముగా, ఇది ఒక సార్వభౌముడైన మరియు ప్రేమగలిగిన దేవుని చిత్తము యొక్క ఫలితము. ఆయన దానిని తన పలుకు ద్వారా ఉనికిలోనికి తెచ్చెను. అంటే కాకుండా, తన జీవులన్నిటి కొరకు, మరి ప్రత్యేకముగా మానవుని కొరకు దానిని పోషించి సంరక్షించి నూతనపరచవలెనని ఆయన కోరుకొనెను (కీర్తన 104 చూడుము).

బైబిలు దేవుని ఉనికిని గూర్చిన తాత్విక వాదనలతో మొదలవ్వదు; దానికి బదులుగా, సార్వభౌముడైన దేవుడు ఉన్నాడని ఎంచుకొనుట మాత్రమే కాక, ఆయన సర్వము యొక్క సృష్టికర్త అని కూడా ఎంచుతుంది. లేఖనములలో

ఇవ్వబడిన దేవుని సందేశము ఆయన యొక్క సృజనాత్మక కార్యముతో మొదలవుతుంది.

## "దేవుడు భూమ్యాకాశములను సృజించెను" (1:1, 2)

**[1]ఆదియందు దేవుడు భూమ్యాకాశములను సృజించెను. [2]భూమి నిరాకారముగాను శూన్యముగాను ఉండెను; చీకటి అగాధ జలము పైన కమ్మి యుండెను; దేవుని ఆత్మ జలములపైన అల్లాడుచుండెను.**

**వచనము 1.** సృష్టిని గూర్చిన వృత్తాంతము בְּרֵאשִׁית (*bere'shith*) అను పదముతో మొదలవుతుంది. దేవుని సృజనాత్మక కార్యము యొక్క ఆరంభముతో ఇది సంబంధము కలిగియుంది. అన్ని పురాతన బైబిలు అనువాదములలో సాంప్రదాయకముగా ఉన్న అనువాదము మొదటి వచనమును ఒక స్వతంత్ర వాక్యముగా చూస్తుంది. ఇది Masoretes (యూదా శాస్త్రులు)తో ఇది ఏకీభవిస్తుంది. హెబ్రీ లేఖనములలో అచ్చుల మరియు ఉచ్చరణల గురుతులను (vowel points and accents) వీరు దాదాపు క్రీ.శ. 800వ సంవత్సరములో చేర్చిరి. NASB అనువాదము వలెనే, అనేకమైన ఆంగ్ల అనువాదములు మొదటి వచనమును స్వతంత్ర వాక్యముగా అనువదించినవి (KJV; ASV; RSV; JB; NIV; NKJV; REB; NCV; CEV; NLT; ESV); మరియు ఈ భావమునే ప్రస్తుత వ్యాఖ్యానములో అనుసరించడము జరిగినది.[1] అప్పుడు మొదటి వచనము ఒక శీర్షిక లేక ఒక రచనకి పైగా రచించబడినదానిగా, ఆ అధ్యాయము అంతటికి సంక్షిప్త రూపముగా ఉన్నది (1:2–31). 5:1; 6:9; 10:1; 11:10లలో వంశావళులను గూర్చిన వాక్యములకు ఉన్న స్థానమే దీనికి ఉంది. ప్రతి వంశావళి కూడా ఒక స్వతంత్ర వాక్యముతో ఆరంభమై, తరువాత వచ్చుదానికి పరిచయముగా పనిచేయుచున్నది.[2]

దేవుని కొరకు అను పదము ఉపయోగించబడినది. కానీ "యెహోవా" లేక "El Shaddai" వంటి నామముల వలే ఇది వ్యక్తిగతమైనది కాదు. ఈ అధ్యాయములో, ఇశ్రాయేలీయుల వ్యక్తిగత నిబంధన దేవుడైన యెహోవాకంటె, ఇక్కడ సృష్టి యొక్క సార్వాభౌముడైన సృష్టికర్తయైన దేవుడే (*'Elohim*) అంశమై యున్నాడనేది మరింత సరిగా ఉన్నది.

తదుపరిగా, లేఖనము చెప్పునదేమంటే, **దేవుడు భూమ్యాకాశములను సృజించెను**. ఆయన సమస్త సృష్టిని సృష్టించెను అని చెప్పుటకు ఇది మరియొక విధానము. ఇక్కడ వాడబడిన בָּרָא, (*bara'*) అను పదము ఒక క్రియాపదము. ఈ పదము పాతనిబంధనలో కేవలము దేవునిని మాత్రమే అంశముగా తీసుకుంటుంది. ఇది ఎల్లప్పుడు మానవునిది కాల, దేవుని సృజనాత్మక

కార్యములను వివరిస్తుంది.[3] ఎల్లప్పుడు ఏదో ఒక నూతనమైన దానిని ఉనికిలోనికి తెచ్చుటను సూచిస్తుంది. ముందుగా ఉన్న పదార్థములోనుండి కానీ (యెష. 43:15, 16; 65:18; యిర్మీయా 31:22లో ఉన్నట్లుగా) లేక ముందుగా ఏమీ పదార్థము లేని స్థితిలోనుండి కానీ (కీర్తన 89:12; యెష. 45:12లో ఉన్నట్లుగా) ఉనికిలోనికి తెచ్చుటకు గూర్చి ఈ పదము సూచిస్తుంది. పదార్థములేవీ లేని స్థితినే ఆదికాండము మొదటి అధ్యాయము తెలియజేస్తుంది. దేవుడు *ex nihilio* ("శూన్యములో నుండి") సృష్టిని సృష్టించాడని ఈ వచనము నిర్దిష్టముగా చెప్పకపోయినా కూడా, ఇది ఇటువంటి స్థితినే సూచిస్తుంది. ఏలయనగా, ఆయన కేవలము, ఏమీ శ్రమలేకుండా, కేవలము తన నోటి మాట ద్వారా సృష్టిని సృష్టించెను. ఈ ఆలోచన హెబ్రీయులకు వ్రాయబడిన పత్రికలో మరింత నేరుగా ఉన్నది. అక్కడ "ప్రపంచములు దేవుని వాక్యమువలన నిర్మాణమైనవనియు, అందునుబట్టి దృశ్యమైనది కనబడు పదార్థములచే నిర్మింపబడలేదనియు విశ్వాసముచేత గ్రహించుకొనుచున్నాము" (హెబ్రీ. 11:3).

**వచనము 2.** మొదటి వచనములో భూమ్యాకాశమూలా సృష్టిని గురించిన పరిచయ వాక్యము తరువాత, రచయిత భూమి వైపునకు తిరిగి, దానిని **నిరాకారముగాను మరియు శూన్యముగాను** תֹהוּ וָבֹהוּ *thohu wabohu* ఉన్నట్లు వివరించుచున్నాడు. మరొక మాటలో, అది ఒక క్రమరాహిత్య స్థితి. భూమి యొక్క ఈ నిర్జీవమైన అస్తవ్యస్త స్థితి, సృష్టి యొక్క ఆరవ రోజు అంతములో చూపించబడిన క్రమము, సౌందర్యము, మరియు జీవమునకు విరోధమైయున్నవి. పాతనిబంధనలోని కేవలము రెండు ఇతర భాగములలో మాత్రమే תֹהוּ *thohu* మరియు וָבֹהוּ *bohu* అను రెండు హెబ్రీ పదములు కలిపి ఉపయోగింపబడినవి. ఈ రెండు భాగములలో కూడా, ఆ పదములు దుష్ట దేశములపై దేవుని తీర్పును వివరించుచున్నవి. యెహోవా యొక్క ఖడ్గము "ఎదోముమీద తీర్పుతీర్చుటకు నేను శపించిన జనముమీద తీర్పుతీర్చుటకు అది దిగును" అని మొదటి వాక్యభాగము తెలియజేయుచున్నది (యెష. 34:5). మరియు, ఈ దైవిక తీర్పు యొక్క ఫలితమును యెషయా "తారుమారు" (*thohu*) మరియు "శూన్యము" (*bohu*) అని వివరించుచున్నాడు (యెష. 34:11).

మరియొక వాక్యభాగము యిర్మీయా నుండి వచ్చుచున్నది. వారి నేరములు మరియు విగ్రహారాధనల నిమిత్తము ప్రవక్త యెరూషలేము మరియు యూదాలపై నాశనమును గూర్చిన సమాచారమును ప్రకటించుచుండెను. బబులోను సైన్యము యూదుల యొక్క స్వస్థలములో మరియు రాజధానిలో మిగిలిపోయినదానిని నాశనము చేయుచుండగా, ఒక దర్శనములో, సృష్టికి విరుద్ధముగా కనిపించుచున్నటువంటి ఒక దృశ్యమును యిర్మీయా చూచెను. శక్తివంతమైన కావ్య ఊహాచిత్రములో, భూమి సృష్టికి పూర్వము ఉన్నట్టి దాని అసలు స్థితిలోనికి వెనుదిరిగి మునిగిపోయినట్లుగా అతడు వర్ణించెను. మునుపటి పట్టణములన్నీ

నాశనమైనవి. మరియు, ప్రజలు కానీ, పక్షులు కానీ, మొక్కలు కానీ, వెలుగు కానీ లేకుండెను. భూమి మరియొక సారి "నిరాకారముగాను" (*thohu*) మరియు "శూన్యముగాను" (*bohu*) ఆయెను (యిర్మీయా 4:23). ఈ ప్రవక్తల యొక్క ప్రవచనాలలో ఈ రెండు పదములు ఉపయోగించబడిన తెరును గమనిస్తే, ఆదికాండము 1:2–31కి ఉన్న భాగము స్పష్టమవుతుంది. అదేమనగా, చీకటి, అస్తవ్యస్తత, మరియు శూన్యతలు, వెలుగు, రూపము, సౌందర్యము, మరియు భావముల యొక్క సృష్టితో భర్తీ చేయబడకుండా ఏదికూడా "మంచిది" అని పలుకబడలేదు.

**చీకటి అగాధ జలము పైన కమ్మియుండెను** అను ప్రతిపాదనలో "చీకటి" మరియు "అగాధము" అను పదములు ఏంటో గొప్ప అశుభముతో సంబంధము కలిగినవిగా ఉన్నవి. పై ఏలయనగా, పురాతనకాపాలు ప్రజలు ఈ శక్తులను అదే విధముగా చూచారు. చాలా కాలము వరకు, "అగాధ" (תְּהוֹם, *th$^{e}$hom*) అను హెబ్రీ పదము అక్కాదీయ (Akkadian) పదమైన తియామత్ (*Tiamat*) నుండి కలిగినదని అనుకున్నారు. ఈ పదము ఒక పురాతన బబులోనులోని "అగాధము" యొక్క దేవత పేరు. ఒక పురాణగాధ ప్రకారము, గందరగోళము నుండి క్రమము రావాలంటే, తియామత్ (Tiamat) అను దేవత మార్దూక్ (Marduk) (దేవతలందరిపై రాజుగా ఉండవలెనని కోరుకొనిన ఒక యువ దేవుడు) ద్వారా చంపబడవలెను.[4] ఏదేమైనా, ఇటీవలి కాలములో, ఈ ఆలోచనకు వ్యతిరేకముగా బలమైన వాదనలు చేయబడ్డాయి. "*th$^{e}$hom* అను మాట "తియామత్" (Tiamat) నుండి రాలేదని,"[5] మరియు ఆదికాండము యొక్క రచయిత పదము కొరకు బబులోను పురాణముపై ఆధారపడలేదని బలమైన వాదనలు చేయబడ్డాయి. నిజామునకు, బైబిలులో తెహోమ్ (*th$^{e}$hom*) యొక్క మానవీకరణ జరుగలేదు; మరియు దేవుడు వెలుగును, జీవము, మరియు సుందరమైన లోకమును సృష్టించకముందు ఇది ఓడించవలసినటువంటి ఒక బలమైన శక్తిగా ఎప్పుడు బైబిలులో ఎంచబడలేదు. దీనికి విరుద్ధమైనది సత్యము. నిరాకారముగా ఉన్న భూమిపాపి ఉండిన అగాధ మరియు చీకటి జలములను ఈ పదము సూచిస్తుంది. ఇవి వేరుపరచబడి సరిహద్దులలో పెట్టబడవలసియుండెను. మానవుడు, జంతువులు, పక్షుల యొక్క నివాసస్థలముల నుండి సముద్రజీవుల నివాస స్థలములను నిర్వహించి, వేరుపరచుట ద్వారా దేవుడు తన సృష్టించే ప్రక్రియను కొనసాగించెను.

దేవుని ఆత్మ జలములపైన అల్లాడుచుండెను అని కూడా లేఖనభాగము ప్రకటిస్తుంది. హెబ్రీ పదమైన רוּחַ (*ruach*), *'Elohim* (దేవుడు) అను మాటతో కలుపుబడ్డప్పుడు "గాలి" లేక "ఆత్మ" అను అర్థమునిస్తుంది. దీనిని "దేవుని నుండి ఒక గాలి" (NRSV) అనికానీ లేక "ఒక బలమైన గాలి" (NAB) అనికానీ అనువదించవచ్చు. ఈ విధముగా అనువదించుట దాదాపు సరియైన విధానము

కాకపోవచ్చు. ఏలయనగా, ఈ పదము పాతనిబంధనలో పదిహేను ఇతర సందర్భములలో వస్తుంది కానీ ఒక సందర్భములో కూడా "ఒక బలమైన గాలి" అనే భావము లేదు.

ఎలోహీమ్ (*'Elohim*) అను మాటను ఆదికాండము 23:6లో వలే నామవాచకముగా (noun) కాక విశేషణ పదముగా (adjective) వాడుకునే అవకాశము ఉంది. ఈ వచనములో అబ్రాహాము "మహారాజు" (లేక "దేవుని యొక్క ఒక యువరాజు"'; ASV) అని పిలువబడ్డాడు. అయినప్పటికీ, ఇటువంటి భావము ఆదికాండము మొదటి అధ్యాయము యొక్క సందర్భమునకు సరిపోదు. 1:2లో ఉపయోగించబడిన ఎలోహీమ్ (*'Elohim*) పదము ఈ అధ్యాయములో ఈ పదము వచ్చిన మిగిలిన ముప్పైయొక్కమారుల కంటే భిన్నమైన భావము కలిగినదిగా ఉంటుందని ఈ అధ్యాయము యొక్క హెబ్రీ లేఖనములను అనువదించుచున్న ఒక అనువాదకుడు భేదము చూపాలని ఎలా ఆశించగలము? అవన్నీ కూడా "దేవుడు" అనే సాధారణమైన అర్థమును యిచ్చుచున్నవి.

రువాహ్ (*ruach*) అను పదము, దేవుని సన్నిధి యొక్క శక్తివంతమైన ప్రత్యక్షతగా ఉన్న "గాలి" అను భావమునిచ్చుటకు ఉపయోగించబడినప్పుడు, అది ఒక నాశానకరమైన శక్తిని తెలియజేస్తుంది. ఉదాహరణకు, నిర్గమకాండము 15:10లో "నీవు నీ గాలిని విసరజేసితివి. సముద్రము వారిని [ఫరో సైనము] కప్పెను. వారు మహా అగాధమైన నీళ్లలో సీసమువలె మునిగిరి" అని దేవుడు అనుచున్నాడు (యెష. 11:15; 40:7; హోషేయా 13:15 చూడుము). ఆదికాండము మొదటి అధ్యాయము యొక్క సందర్భము రువాహ్ ఎలోహీమ్ (*ruach 'Elohim*) యొక్క అటువంటి ప్రయోగమును నిషేధిస్తుంది. నాశానకరమైన శక్తిగా ఉపయోగించబడుటకు బదులుగా రువాహ్ ఎలోహీమ్ *ruach 'Elohim*) అను పదము ఆదికాండములో మొదలైన ఒక నిర్మాణాత్మకమైన, సృజనాత్మక ప్రక్రియలో భాగముగా ఉన్నట్లు కనబడుతుంది.

**దేవుని ఆత్మ జలములపై "అల్లాడుచుండెను"** (מְרַחֶפֶת, *m*[e]*rachepeth*) అని లేఖనభాగము చెబుతున్నప్పుడు, ఆ క్రియాపదము ఆత్మ "కదులుచుండెను" (NIV; ESV) అను భావము కూడా కలిగియుండవచ్చు. ఈ విధముగా వ్యాఖ్యానించుటకు కారణమేమనగా, ఇంకొక వాక్యభాగము యెహోవాను తన బిడ్డలపై కాపుదలగా "అల్లాడుచు" న్న (רָחַף, *rachap*) ఒక పక్షిరాజువలె ఉన్నట్లు పోల్చుచున్నది (ద్వితీ. 32:11). ఆదికాండము 1లో ఉన్న ఈ వాక్యము యొక్క భావము ఇదైతే, అగాధ జలములోని అవ్యవస్థ పరిస్థితిలో కూడా, దేవుని యొక్క సంరక్షణ ఆత్మ సమస్తమును నియంత్రణలో ఉంచినదని ఈ వచనము ఉద్ఘాటించుచున్నది. కేవలము కొద్ది సమయములోనే దేవుడు మాట్లాడుటకు ఆరంభించి, తన సృష్టి యొక్క మొదటి స్థితినుంచి క్రమమును, జీవమును, మరియు సౌందర్యమును తెచ్చెను.

## దినము 1: వెలుగు సృష్టించబడి చీకటి నుండి వేరుపరచబడెను (1:3–5)

**[3]దేవుడు–వెలుగు కమ్మని పలుకగా వెలుగు కలిగెను. [4]వెలుగు మంచిదైనట్టు దేవుడు చూచెను; దేవుడు వెలుగును చీకటిని వేరుపరచెను. [5]దేవుడు వెలుగునకు పగలనియు, చీకటికి రాత్రి అనియు పేరు పెట్టెను. అస్తమయమును ఉదయమును కలుగగా ఒక దినమాయెను.**

**వచనము 3**. క్రమబద్ధముగా సృష్టించుట యొక్క ప్రక్రియ ఆరంభముగా, అది దేవుని పలుకబడిన వాక్యము ద్వారా జరిగెను. దేవుడు పలికెను అను ప్రతిపాదన ఈ అధ్యాయమంతటిలో మరియు లేఖనములన్నిటిలో రచయిత ఉపయోగించిన ధోరణి మరియు మాదిరిని స్థాపించెను. దీనిని వివరించుటకు, ఒక కీర్తనాకారుడు "యెహోవా వాక్కు చేత ఆకాశములు కలిగెను. ఆయన నోటి ఊపిరిచేత వాటి సర్వసమూహము కలిగెను ... చెప్పెను." "వాక్కు" మరియు "ఊపిరి" (రువాహ్, [*ruach*] "ఆత్మ") మధ్య ఒక సమాంతర (Parallellism) ఉంది. దేవుడు మాట్లాడినప్పుడు, తాను జరుగునట్లుగా, ఆయన తన ఆత్మ యొక్క సృజనాత్మక శక్తిని విడుదల చేసెను.

నమోదు చేయబడిన సృష్టికర్త యొక్క మొదటి మాట ఒక ఆజ్ఞయైయున్నది: **"వెలుగు కమ్మ"ని పలుకగా వెలుగు కలిగెను**. కనుక, విశ్వమునకు క్రమము మరియు సౌందర్యమును తెచ్చుటలో చేయబడిన ఆరంభ కార్యము వెలుగు యొక్క సృష్టియైయున్నది. ఇది సహజమైన భౌతిక వెలుగు. ఏలయనగా, అది లేకుండా, సమస్తము చీకటి మరియు అవ్యవస్థ భౌతికమండలముగా ఉండేది. సూర్యుని సృష్టికి మూడు రోజుల ముందే దేవుడు వెలుగును సృష్టించెనను వాస్తవము పాఠకుని శ్రమపరచనవసరము లేదు. ఏలయనగా, మొదటి దినమున వేరొక మూలమునుండి దేవుడు వెలుగును ప్రకాశింపజేసెనని మాత్రమే రచయిత ధృడపరచెను. ఒకదానిని వేరుగా ఒకటి ఉన్న ప్రదేశములను తెలియజేయుటకు బైబిలులో తరచుగా వెలుగు మరియు చీకటులను ఉపయోగించడము జరిగినది; ఉదాహరణకు, ఐగుప్తు నేల అంతటిపై, ఐగుప్తీయుల గృహములలో కూడా మూడు దినములవరకు చీకటి ఉండెను; కానీ ఇశ్రాయేలీయుల గృహములు వెలుగును కలిగియుండినవి (నిర్గమ. 10:21–23). అలాగే, అరణ్యములో, ఇశ్రాయేలీయుల శిబిరమును చీకటి కమ్ముకొనెను; కానీ, ప్రత్యక్షగుడారముపై మాత్రము వెలుగు స్తంభము ఉండెను. అది దేవుని ప్రజలకు వెలుగునిచ్చెను (సంఖ్యా. 9:15–18; నిర్గమ. 13:20–22 చూడుము).

ఆత్మీయ భావములో చూసుకుంటే, మంచిని చెడుతో భేదము చూడబడినప్పుడు చీకటినుండి వెలుగు యొక్క ప్రత్యేకత స్పష్టమగుచున్నది.

వెలుగు తరచూగా ఒక రూపాలంకార భావముతో ఉపయోగించబడి, నీటికి మరియు జీవమునకు (కీర్తన 37:6; 56:13), జ్ఞానము మరియు దేవుని ఆజ్ఞలకు (యోబు 12:22; 24:13), మరియు రక్షణ మరియు దేవుని సన్నిధికి (సంఖ్యా. 9:15, 16; కీర్తన 27:1; యెష. 9:2) ప్రతినిధిగాను ఉంది. మరొకవైపు, చీకటి పాపము మరియు దుష్టత్వములకు (యోబు 5:14; సామెతలు 2:13; ప్రసంగి 2:14), మూఢనమ్మకములు మరియు విగ్రహారాధనలకు (యెష. 9:2; యెహెజ్కేలు 8:12), మరియు తీర్పు మరియు మరణములకు (కీర్తన 105:28; యెహెజ్కేలు 30:18; యోవేలు 2:2) చిహ్నముగా ఉన్నది.

**వచనము 4**. వెలుగును సృష్టించిన తరువాత, దేవుడు, ఒక నేర్పరియైన కళాకారుని వలె, తన కార్యమును తానే అభినందించుటకు ఒక అడుగు వెనుకకు వేసి వెలుగు ఎంత సుందరముగా ఉన్నదో చూచెను. కనుక ఆయన **వెలుగును చీకటిని వేరుపరచెను** మరియు అది **మంచిదైనట్టు** ప్రకటించెను. "మంచి" (*tob*) అనగా, అది నైతికముగా మంచిదని దేవుని భావము కాదు; దానికి బదులుగా, అది దేవుడు దానిని ఏ ఉద్దేశము కొరకు చేశాడో అది దానిని చేయుటకు సమర్థత కలిగి ఆకార్యమునకు తగినదని దీని భావము. జీవము కొనసాగే వాతావరణము సాధ్యపడుట కొరకు శక్తిని అనుగ్రహించి, తన సృష్టి యొక్క సౌందర్యమును ప్రత్యక్షపరచుటయే ఈ వెలుగు యొక్క ఉద్దేశము. దేవుడు "వెలుగును చీకటిని వేరుపర"చినప్పుడు, ఇదివరకే ఉండిన చీకటిని ఆయన నాశనము లేదా రద్దు చేయలేదు. దానికి బదులుగా, వాటిని భిన్నముగా ఉంచుటకొరకు, ఆయన వాటిని వేరుపరచెను. ఈ రెండు కూడా, కాలమందు, వాటి వాటి పరిధులు కలిగి ఉంటాయి. కొంత కాలము ఒకటి పనిచేయగా, దాని తరువాత మరియొకటి పని చేస్తుంది.

**వచనము 5. దేవుడు వెలుగునకు పగలనియు, చీకటికి రాత్రి అనియు పేరు పెట్టెను.** ఆదికాండము యొక్క మొదటి అధ్యాయమంతటిలోను, సృష్టికర్త తాను చేసిన అనేకమైన వాటికి పేరులు దయచేసెనని రచయిత ఉద్ఘాటించెను. ఆయన వెలుగుకు "పగలు" అనియు చీకటికి "రాత్రి" అనియు పేరు పెట్టెను (1:5). విశాలమునకు దేవుడు "ఆకాశము" అనియు (1:8), ఆరిన నేలకి "భూమి" అనియు, మరియు జలసమూహములకు "సముద్రములు" అనియు (1:10) పేరులు పెట్టెను. అదనముగా, ఆయన స్త్రీ పురుషులను "మానవుడు" (אָדָם, *'adam*), లేక "మానవజాతి" అని పిలిచెను (1:27; 5:1, 2 పైని వ్యాఖ్యానమును చూడుము). పాతనిబంధనలో దేనికైనా పేరు పెట్టుట అనునది, దానిపై ఆధిపత్యమును చాటుతుంది (2:20, 23; 3:20; 4:25; 2 రాజులు 23:34; 24:17 చూడుము). ఈ విధముగా, పేరు పెట్టబడిన ఈ సృష్టములు తన ప్రణాళికలో వహించవలసిన సరియైన పాత్రలను దేవుడు నిర్వచించెను.

**అస్తమయమును ఉదయమును కలుగగా ఒక దినమాయెను.** సృష్టి యొక్క

ప్రతి దినము యొక్క ముగింపులో, రచయిత ఆ వాక్యభాగమును ఒకే విధమైనటువంటి వాక్యముతో ముగించెను. ఈ వాక్యభాగములలో ప్రతి నూతన దినమునకు సరిపోవునటువంటి సంఖ్యను పొందుపరచెను (1:8, 13, 19, 23, 31). ఒక హెబ్రీయుని మనస్సులో, దినము చీకటితో మొదలై (1:2 చూడుము), తరువాత వెలుగు యొక్క సృష్టి వస్తుంది; మరియు, ఇది మరలా రాత్రి అయేవరకు కొనసాగి, మరుసటి దినము యొక్క ఆరంభమును తెస్తుంది.

## దినము 2: విశాలము వలన జలములు వేరుపరచబడెను (1:6–8)

**6మరియు దేవుడు – జలముల మధ్య నొక విశాలము కలిగి ఆ జలములను ఈ జలములను వేరుపరచును గాకని పలికెను. 7దేవుడు ఆ విశాలము చేసి విశాలము క్రింది జలములను విశాలము మీది జలములను వేరుపరచగా ఆ ప్రకారమాయెను. 8దేవుడు ఆ విశాలమునకు ఆకాశమని పేరు పెట్టెను. అస్తమయమును ఉదయమును కలుగగా రెండవ దినమాయెను.**

**వచనములు 6–8**. దేవుడు మరలా మాటలాడగా, దాని ఫలితముగా **విశాలము** యొక్క సృష్టి జరిగెను. అది విశాలము క్రింది **జలములను విశాలము మీది జలములను వేరుపరచెను**. హెబ్రీ భాషలో "విశాలము" అని అనువదించబడిన పదము (רָקִיעַ, *raqia'*), మరియు దాని ప్రాథమిక భావము "పరచబడుట" లేక "బలముతో సాగదీయబడుట" (లోహపు పలకలను చేసినట్టు) అను విషయములతో సంబంధము కలిగియుండి. కొన్ని వాక్యభాగములు అను (רָקַע, *raqa'*) క్రియాపదమును, ఘనరూపములో ఉన్న లోహమును బలముతో సాగదీయుట అనే భావముతో ఉపయోగిస్తాయి (నిర్గమ. 39:3; సంఖ్యా. 16:39 [17:4]; యెష. 40:19; యిర్మీయా 10:9; యోబు 37:18 చూడుము). ఈ కారణమును బట్టి కొందరు పండితులు (*raqia'*) అను పదమును "పరలోకము యొక్క పైకప్పు, లేక ఆకాశము,"" హెబ్రీయులు దీనిని ఘనరూపక పదార్థముగా ఎంచుతారు, మరియు ఇది దానిపైనున్న 'జలముల'కు ఆధారముగా నిలుస్తుంది"[6] (KJV చూడుము).

అయితే, ఆదికాండము యొక్క రచయిత *raqia'* అను పదమును ఘనపదార్థముగా ఉన్న ఒక గుమ్మటము లేక ఒక పైకప్పుగా అర్థము చేసికొనలేదనునది స్పష్టమే. ఏలయనగా, దేవుడు ఆ విశాలమునకు ఆకాశము (שָׁמַיִם, *shamayim*) అని పేరు పెట్టెను అని ఆటను రూఢిగా చెప్పెను (NIV అనువాదములో కూడా 'ఆకాశము' అని అనువదించబడెను). సూర్యుడు, చంద్రుడు, మరియు నక్షత్రములు అందులో పెట్టబడినవని ఆటను చెప్పెను

(1:14–17). దానిని ఆటను పక్షులు ఎగురు “ఆకాశ విశాలము” అని కూడా పిలిచెను (1:20), అనగా, వాతావరణము.[7] ఆటను ఖచ్చితముగా దానిని ఏదైనా లోహము లేక గాజు వంటి ఒక ఘనపదార్థముగా ఉన్న గోళమని అర్థము చేసికొనలేదు. దీనికి బదులుగా, ఆటను ఆ విశాలమును దృగ్విషయ శాస్త్ర (phenomenological) విధానములో వివరించెను. సూర్యచంద్రులు ఆకాశ విశాలమందు ఉంచబడియున్నట్లుగా మానవుడు చూస్తాడు. కానీ, అదే సమయములో, పక్షులు సులభముగా ఆకాశములో ఎగురుతాయి. ఈ వచనములలో, విశాలము అనగా కేవలము, పైనున్న జలములకు (మబ్బులలో) మరియు క్రిందున్న జలములకు (భూమిపైన) మధ్య ఒక విభజన మాత్రమే.

విశాలమును (లేక ఆకాశము) గూర్చి బైబులు యొక్క నిర్వచనము ప్రాచీన బబులోను సృష్టిని గూర్చిన వివరణకంటే భిన్నమైనది. ఎనూమా ఎలీష్ (*Enuma Elish*) ప్రకారము, మార్డూక్ (Marduk) దేవుడు తియామత్ (Tiamat) దేవతను చంపినప్పుడు, “అతను ఆమెను గుల్లలోనుండు జలజంతువును (shellfish) విభజించినట్లుగా విభజించెను.” ఆమెలో సగభాగమును క్రింది జలములుగా అతను భూమిపై వదిలివేసెను. మరియు ఇంకో సగభాగమును అతను “లోకప్పు” వేయబడిన ఆకాశముగా (చెరసాల) ఆకాశమండలములలో చేసెను. అప్పుడు అతను కావలివారిని ఉంచి, “ఆమె జలములు తప్పించుకొనకపోవునట్లు అతను వారికి కట్టబెట్టెను.”[8] ఈ పురాణ గాథలో, ఆకాశము ఇంతకూ ముందే ఉండిన పదార్థము ద్వారా చేయబడెను. అనగా, సముద్రము యొక్క దుష్ట దేవతయైన తియామత్ (Tiamat) యొక్క సగము శరీరముతో చేయబడెను. మార్డూక్ (Marduk) ఆమెను బంధించి, ఆమె భూమిపై నాశనకరమైన జలములను కుమ్మరించకుండునట్లు, కావలివారిని ఉంచెను. కనుక, ఈ పురాణ గాథలో, ఆకాశములోని జలములు వ్యతిరేకించుచున్న ఒక దేవతగా చూడబడతాయి. ఈ దేవత వధించబడినను, ఆమె యొక్క నాశనకరమైన విధానములనుండి భూమిని కాపాడుట కొరకు, ఆమెను నిత్యము కావలిలో ఉంచవలసివచ్చెను. యేసు యొక్క దృక్పథము కంటెను లేక ఆదికాండము యొక్క రచయిత యొక్క దృక్పథముకంటెను ఇది బహు భిన్నమైనది. యేసు దేవునిని గూర్చి ప్రేమగల తండ్రిగా “నీతిమంతులమీదను అనీతిమంతులమీదను వర్షము” పంపించుచు మానవాళి యొక్క జీవితములను ఆశీర్వదించుచున్నట్లు వివరించెను (మత్తయి 5:45).

## దినము 3: నేల, మొక్కలు, మరియు వృక్షములు సృష్టించబడెను

## (1:9–13)

**[9]దేవుడు–ఆకాశము క్రిందనున్న జలము లొకచోటనే కూర్చబడి ఆరిన నెల కనబడును గాకని పలుకగా ఆ ప్రకారమాయెను. [10]దేవుడు ఆరిన నేలకు భూమి అని పేరు పెట్టెను, జలరాశికి ఆయన సముద్రములని పేరు పెట్టెను, అది మంచిదని దేవుడు చూచెను. [11]దేవుడు–గడ్డిని విత్తనములిచ్చు చెట్లను భూమిమీద తమ తమ జాతి ప్రకారము తమలో విత్తనములుగల ఫలమిచ్చు ఫలవృక్షములను భూమి మొలిపించునుగాకని పలుకగా ఆ ప్రకారమాయెను. [12]భూమి గడ్డిని తమ తమ జాతి ప్రకారము తమలో విత్తనములుగల ఫలవృక్షములను మొలిపింపగా అది మంచిదని దేవుడు చూచెను. [13]అస్తమయమును ఉదయమును కలుగగా మూడవ దినమాయెను.**

**వచనములు 9, 10**. ఈ వివరణను యిచ్చిన రచయిత మబ్బులలోని “జలముల” నుండి భూమిపైనున్న **జలముల** వైపునకు త్వరితముగా తిరిగెను. తప్పనిసరిగా, భూమి మానవులకు మరియు జంతువులకు నివాస స్థలముగా ఉండుటకు చేయబడినది (1:24—31). ఏదేమైనా, అది జంతువులకు మరియు మానవులకు నివాస స్థలముగా ఉండుటకు ముందుగా, **ఆరిన నేల జలములనుండి** విభజింపబడవలసియుండెను. నేలపై నివసించువారి ఉనికి నిమిత్తము దేవుడు సరిహద్దులను దయచేసెను. ఆరిన నెలకి దేవుడు **భూమి** అని పేరు పెట్టెను. మరియు జలరాశికి **సముద్రములు** అని పేరు పెట్టెను. అలాగే, దేవుడు తన కార్యమును మంచిది అని ప్రకటించెను.

**వచనములు 11–13**. నేల జంతువులు మరియు మానవుని యొక్క సృష్టి జరగాలంటే ఆరిన నేల మాత్రమే కాదు కానీ, విత్తనములు గల ఫలమిచ్చు ఫలవృక్షములు కూడా ఉండవలసిన అవసరత ఉండినది. భూమి అనేక **ఫలవృక్షములను** పుట్టించునట్లు **దేవుడు** ఆజ్ఞాపించెను. కొందరు చెప్పినట్లుగా, ఈ పుట్టించే శక్తి ప్రకృతిని ఒక దేవతగా (భూదేవి) చేయలేదు. నేలకి తనకుతానుగా ఎటువంటి ఫలవృక్షములను పుట్టించే శక్తి లేదు; కానీ, దేవుడే తన సృష్టించే శక్తి గల మాట ద్వారా **వృక్షజీవము** వచ్చునట్లు చేసెను. ఇదే విషయమును కీర్తనాకారుడు ఈ విధముగా చెప్పెను: “పశువులకు గడ్డిని నరుల ఉపయోగమునకు కూరమొక్కలను ఆయన మొలిపించుచున్నాడు” (కీర్తన 104:14).

దేవుడు తమ తమ జాతి ప్రకారము తమలో విత్తనములుగల ఫలమిచ్చు ఫలవృక్షములను మొలిపించుట ద్వారా వృక్షజీవము యొక్క కొనసాగింపు మరియు అభివృద్ధి కొరకు సమకూర్చి, జంతువులకు మరియు మానవులకు

కూడా సమృద్ధిగా ఆహారము దొరుకునట్లు చేసెను.ఇది, భూమి యొక్క విభిన్నమైన వాతావరణమూలయందు వృక్షజీవము యొక్క అంచనా మరియు స్వీకృతికి దారితీసినది.

ఇదంతా కూడా, తప్పనిసరిగా, పురాతన మధ్య ఈశాన్య ప్రాంతము యొక్క పురాణాలకు వ్యతిరేకముగా ఉన్నదనుట విదితమే. ఉదాహరణకు, కనానులో, బయలు (సంతానోత్పత్తి దేవుడు) సంవత్సరాంతములో మోతు (Mot) ("మృత్యువు" యొక్క దేవుడు) చేతిలో మరణించెనని విశ్వసించబడుతుంది. దీనిని బట్టియే ఎండాకాలము కోత తరువాత పంటలు ముడతలుపడి చనిపోతాయని నమ్మకము. అప్పుడు బయలు మృత్యువు యొక్క దేవుని ద్వారా అగాధములోనికి తీసికొనబడుతుందని చెప్పబడినది; కానీ సంవత్సరములోని వసంతకాల సమయములో, బయలు యొక్క భార్య అయిన (Anath) అనాతు దేవత, మోతుని (Mot) ఒక రక్తసిక్తమైన యుద్ధములో చంపి, అతనిని రక్షిస్తుంది. దీని తరువాత, బయలు (Baal) పునరుజ్జీవింపబడి అనాతుతో లైంగిక సంబంధము పెట్టుకొనెను. వీరి కలయిక భూమిలో ఫలము తిరిగివచ్చుటకు కారణమాయెను. ఇది నూతన పంటలు పండుటలోను, మానవులలో మరియు జంతువులలో నూతన జీవము కలుగుటకును కారణమాయెను.[9]

అనేక పురాతన మతములు ఇటువంటి పురాణగాథలు మరియు సంతానోత్పత్తి సంస్కార ఆచారాలను కలిగియున్నాయి. వీటిలో ఆరాధికులకు మరియు పవిత్ర వేశ్యలకు మధ్య లైంగిక సంబంధము జరిగేది (హోషేయ 4:11–14 చూడుము). ఈ దిగజారిన పద్ధతులు దేవతలను ఇటువంటి కార్యములు చేయుటకు పురికొల్పుటకుగాను రూపొందించబడినవి. దీని ద్వారా పంటలు మరియు ఫలముల యొక్క సమృద్ధి మరియు జంతువులకు మరియు మనుష్యులకు సంతానము కలుగజేయుటయే వీటి ఉద్దేశము. ఇటువంటి చెడిపోయిన సంతానోత్పత్తి వివరణలకు వ్యతిరేకముగా ఆదికాండములోని లేఖనభాగము ఉన్నది. ఈ సృష్టి యొక్క సార్వభౌముడైన దేవుడు ఆరిన నేల వచ్చునట్లు చేసి సముద్రములను వేరుపరచి, భూమి అన్ని రకముల పంటలు మరియు ఫలములను పుట్టించునట్లు, ఆయన దానిని ఫలభరితముగా చేసెను (సంపూర్ణముగా పోషకములతో). మరియు, భూమి యొక్క **ఫలమునిచ్చే** లక్షణము తానుగా కొనసాగునట్లు ఆయన నియమించెను. జీవము కలిగియుండిన అనేక రకములైన విత్తనముల యొక్క ప్రక్రియ ద్వారా ఆయన ఈలాగున చేసెను– మరియు, ఇదంతయు కూడా సృష్టి యొక్క ఏకైన దేవుడైన జీవము యొక్క నిజమైన ప్రభువు యొద్ద నుండియే వచ్చును. అప్పుడు, **మూడవ దినము** యొక్క అంతములో, ఆయన చేసినదానినంతటిని దేవుడు మంచిది అని ప్రకటించెను.

## దినము 4: సూర్యుడు, చంద్రుడు, మరియు నక్షత్రములు ఆకాశములో ఉంచబడెను (1:14–19)

**[14]దేవుడు–పగటిని రాత్రిని వేరుపరచునట్లు ఆకాశవిశాలమందు జ్యోతులు కలుగును గాకనియు, అవి సూచనలను కాలమునలు దినసంవత్సరములను సూచించుటకై యుండునుగాకనియు, [15]భూమిమీద వెలుగిచ్చుటకు అవి ఆకాశవిశాలమందు జ్యోతులై యుండు గాకనియు పలికెను; ఆ ప్రకారమాయెను.**
**[16]దేవుడు ఆ రెండు గొప్ప జ్యోతులను, అనగా పగటిని ఏలుటకు పెద్ద జ్యోతిని రాత్రిని ఏలుటకు చిన్న జ్యోతిని నక్షత్రములను చేసెను. [17–18]భూమిమీద వెలుగిచ్చుటకును పగటిని రాత్రిని ఏలుటకును వెలుగును చీకటిని వేరుపరచుటకును దేవుడు ఆకాశ విశాలమందు వాటినుంచెను; అది మంచిదని దేవుడు చూచెను. [19]అస్తమయమును ఉదయమును కలుగగా నాలుగవ దినమాయెను.**

**వచనములు 14, 15.** ఖగోళ సమూహముల యొక్క సృష్టి–సూర్యుడు, చంద్రుడు, మరియు నక్షత్రములు–ఈ అధ్యాయములోని ఒక్క మానవుని సృష్టి తప్ప, ఏ ఇతర విషయముకంటే కూడా ఎక్కువగా వివరించబడినది. మరియు, ఈ వృత్తాంతములోని విషయము పునరావృతమవుతూ ఉంది. ఆకాశ సమూహములకు పురాతన లోకపు ప్రజల ఆలోచనలలో ఉండిన గొప్ప ప్రాముఖ్యతయే. నాలుగవ దినము యొక్క వివరణకు యిచ్చిన ఈ పెద్ద స్థానమునకు కారణము అయి ఉండవచ్చు. మెసొపొతమియ, పాలస్తీనా, మరియు ఐగుప్తులలో, సూర్యుడు, చంద్రుడు, మరియు నక్షత్రములు, మానవుల యొక్క మరియు రాజ్యముల యొక్క జీవితములను మరియు గమ్యములను నియంత్రించునటువంటి దేవుళ్ళుగా ఆరాధించబడినవి.

ఏదేమైనా, ఆదికాండము యొక్క రచయిత వాటిని ఏంటో తేలికగా మూడు క్రియలు జరిగించుటకు దేవుడు సృష్టించిన **జ్యోతులు** అని చెప్పెను. (1) **అవి పగటిని రాత్రిని వేరుపరచాలి.** (2) అవి **సూచనలుగా** ఉండి **కాలములను దిన సంవత్సరములను** సూచించుటకై ఉండెను. (3) అవి **భూమిమీద వెలుగిచ్చుటకు** ఉన్నాయి. పురాతన ప్రజలు ఈ ఆకాశములోని సమూహములకు మతపరమైన భక్తిని ఇచ్చుచుండిరి. ఈ సందర్భములో ఇవి ద్రుళ్ళు కావనీ, స్వేచ్ఛానువర్తముగలవి కావనీ బైబిలులోని వృత్తాంతము తెలియజేయుచున్నది. అవి నిత్యమైనవి కూడా కావు; దీనికి విరుద్ధముగా, అవి ఏకైక సార్వభౌముడైన దేవుడు సృష్టించినవి–సేవించబడుటకు కాదు, కానీ సేవ చేయుటకు, మరియు వాటిని చేసినవాని చిత్తమును నెరవేర్చుటకు అవి చేయబడ్డాయి (కీర్తన 104:19–23 చూడుము).

**వచనములు 16–19.** ఖగోళములోని సమూహములను దైవములుగా ఎంచే

సమకాలీన దృక్పథములు ఉండిన సందర్భములో రచయిత రచించుచున్నాడని ఈ వచనములలో అతను ఉపయోగించిన పదములను బట్టి స్పష్టమగుచున్నది. మొదటిగా, అతను ఒక అసాధారణ వ్యక్తీకరణను ఉపయోగించెను. సాధారణముగా సూర్యునికి ఉపయోగించే (שֶׁמֶשׁ, *shemesh*, షెమెష్) అను పదమునకు బదులుగా, **పెద్ద జ్యోతి** అను అసాధారణమైన పదమును ఉపయోగించెను. రెండవదిగా, అతను, సాధారణముగా చంద్రునికి ఉపయోగించే (יָרֵחַ, *yareach*) అను పదమునకు బదులుగా, **చిన్న జ్యోతిని** గురించి రచించెను. బహుశ, "సూర్యుడు" మరియు "చంద్రుడు" కొరకు సాధారణముగా ఉపయోగించే పదములకు బదులు ఈ పదములను ఎందుకు ఉపయోగించియుండవచ్చునంటే, ఇతర సెమిటిక్ (యూదులకు చెందిన) భాషలలో, ఈ పదములు దేవుళ్ళ యొక్క పేరులుగా ఉండినవి. కనాను పట్టణములలో కొన్ని, ఉదాహరణకు, బేత్షెమేషు మరియు యెరికోల వలె, వాటి పేరుల యొక్క అన్యమతములకు సంబంధించినటువంటి ప్రాముఖ్యతను నిలుపుకొనెను.[10]

ఈ అన్య నాయములలో అనేకమైనవి వాగ్దాన దేశములో అనేక వందల సంవత్సరములు కొనసాగుచుండినప్పటికీ, వారి గమ్యమును గూర్చిన సమాధానములు సూర్యుడు, చంద్రుడు, లేక **నక్షత్రములలో** ఉండదు కానీ, సమస్తమైనవాటిని చేసిన ఏకైక సత్యదేవుని యొద్దనే ఉంటాయనే విషయమును తన ప్రజలు గుర్తు పెట్టుకోవాలని ఆదికాండము యొక్క రచయిత ఆశించెను. ఖగోళ సమూహాలు ఆకాశములను ఏలుతాయంటే ("పరిపాలన" లేక "వాటిపై పరిపాలన"' KJV; ASV), కేవలము పగటిని మరియు రాత్రిని ఏలుటకు మరియు నియమింపబడిన కాలములకు (దినములు మరియు సంవత్సరములకు) సూచనలుగా మాత్రమే ఉంటాయని దాని అర్థము. పురాతన ప్రజలు ఈ ఆకాశ సమూహాలు ఆరాదించవలసినది కాదు; అయితే, ఈ ఖగోళంలోని సమూహాలు కేవలము సృష్టిలో ఒక భాగమైయుండి, సృష్టికర్త యొక్క మహిమకు సాక్షులుగా ఉన్నాయి (కీర్తన. 19:1–6).

మునుపటి దినములలో దేవుని కార్యములను గూర్చి చెప్పబడినట్లుగానే నాలుగవ దినమును గూర్చి కూడా అది మంచిది అని లేఖనభాగము తెలియజేస్తుంది. **నాలుగవ దినమున** సూర్యుడు, చంద్రుడు, మరియు నక్షత్రముల యొక్క సృష్టి (వెలుగు వాహకులుగా), మొదటి దినమున వెలుగును సృష్టించుట మరియు దానిని చీకటి నుండి వేరుపరచుటకు అనుగుణ్యముగా ఉన్నది.

# దినము 5: జలములు మరియు ఆకాశము సముద్రజీవులు మరియు పక్షులతో నిండుట (1:20–23)

**20 దేవుడు–జీవముకలిగి చలించువాటిని జలములు సమృద్ధిగా పుట్టించును
గాకనియు, పక్షులు భూమిపైన ఆకాశ విశాలములో ఎగురును గాకనియు పలికెను.
21 దేవుడు జలములలో వాటి వాటి జాతి ప్రకారము జలములు సమృద్ధిగా పుట్టించిన
మహా మత్స్యములను, జీవముకలిగి చలించువాటినన్నిటిని, దాని దాని జాతి
ప్రకారము రెక్కలుగల ప్రతి పక్షిని సృజించెను. అది మంచిదని దేవుడు చూచెను.
22 దేవుడు–మీరు ఫలించి అభివృద్ధిపొంది సముద్ర జలములలో నిండి
యుండుడనియు, పక్షులు భూమిమీద విస్తరించును గాకనియు, వాటిని
ఆశీర్వదించెను. 23 అస్తమయమును ఉదయమును కలుగగా అయిదవ
దినమాయెను.**

**వచనము 20**. రెండవ దినము మరియు అయిదవ దినము మధ్య సంబంధము గమనించదగినది. రెండవ దినమున, దేవుడు పైనున్న జలములను మరియు క్రిందున్న జలములను వేరు చేసెను. పలురకమైన జీవుల కొరకు నివాసము కలుగునట్లు ఆయన ఈలాగున చేసెను. తరువాత, అయిదవ దినమున, ఆయన ఆకాశములో (**ఆకాశముల విశాలము**) వాసము చేయగల **పక్షులను** సృజించెను. మరియు మహా సముద్రములను, సముద్రములను, మరియు నదులను (క్రింది జలములు) నివాసముగా చేసికొనగల నీటి జీవులను ఆయన సృజించెను.

జీవము కలిగి చాలించువాటిని జలములు సమృద్ధిగా పుట్టించవలెనని వృత్తాంతము తెలియజేయుచున్నది. “పుట్టించుట” అను క్రియాపదము (שָׁרַץ, *sharats*) “జీవముకలిగి చలించువాటిని” (שֶׁרֶץ, *sherets*) అను భావమునిచ్చు ఒక బహువచనపు నామవాచకపు పదముతో కలుపుబడినది. ఈ నామవాచకపు పదము యొక్క భావము “చలించే జీవులు.”[11] ప్రత్యేకముగా, షెరెత్స్ (*sherets*) అను పదము వేగముగా కదిలే జీవులైన పురుగులు, ఎలుకలు, చిన్న సరీసృపములు, మరియు బల్లుల వంటి జీవులను సూచిస్తుంది. ఈ సందర్భములో ఈ పదము సాధారణముగా నీటి జీవులను సూచిస్తుంది. మరియు ఇందులో 21వ వచనములోని “మహామత్స్యములు” కూడా ఉండియుండవచ్చు.

“జీవముకలిగి” (נֶפֶשׁ חַיָּה, *nepesh chayyah*) అను పదము “చలించువాటిని” అను పదమునకు సంబంధము కలిగియుంది. ఈ వాక్యభాగము అన్నిటిని కలుపునది; ఇది, 1:20, 21లోని నీటి జీవులకు, 1:24లోని భూజంతువులకు, 9:10లోని పక్షులు మరియు నేలపైని జంతువులకు, 2:7లోని మానవునికి, మరియు 9:16లోని జంతువులకు అన్వయించబడుతున్నది. ఇది జీవవాయువు

గలిగిన అన్ని జీవులను గూర్చి మాటలాడుచున్నది (2:7 పైన చేయబడిన వ్యాఖ్యానము చూడుము).

**వచనములు 21–23**. *Bara* (సృష్టించుట) అను పదము మొదటి వచనము తరువాత మరలా 21వ వచనములో మాత్రమే కనిపిస్తుంది. ఈ వచనములో **దేవుడు సృష్టించిన** మూడు ప్రధాన రకములైన **జంతువులను** గూర్చి చెప్పబడినది. జలములలో చాలించు చిన్న చేపలు, మరియు సముద్ర గర్భములో ప్రాకే జీవులు ఉండినవి. తరువాత, ఆకాశములలో ఎగురు **పక్షులు** ఉండినవి. అంతిమముగా, మూడవ గుంపులో, రచయిత ప్రత్యేకముగా, **మహా సముద్ర మత్స్యములను** గూర్చి చెప్పెను (הַתַּנִּינִם הַגְּדֹלִים, *haththanninim hagg*$^{e}$*dolim*).

"మహా మత్స్యములు" అని అనువదించబడిన హెబ్రీ పదము యొక్క మూలపదము (תַּנִּין, *thannin*). దీనిని "సర్పము" లేక "డ్రాగన్ (dragon)"[12] అని కూడా అర్థము చేసికొనవచ్చు. మరియు ఇది పాము (నిర్గమ. 7:9), మొసలి (యెహెజ్కేలు 29:3), లేక ఏదో ఒక శక్తివంతమైన జీవి (యిర్మీయా 51:34) గురించి కూడా ఉపయోగించబడెను. ఇది కావ్య మరియు ప్రవచన సాహిత్యములో కూడా ఒక సాదృశ్యరీతిలో, దేవుని శత్రువులపై ఆయన విజయమును వివరించుటకు ఉపయోగించబడినది (యోబు 7:12; కీర్తనలు 74:13; యెష. 27:1; 51:9). సృష్టిని గూర్చిన వివరణములో, రచయిత ఈ పదమును దేవుడు తన శత్రువులతో పోరాడుచుండిన భావముతో ఉపయోగించుటలేదు కానీ, నిజమైన నీటి జీవులైన తిమింగములు, నీటిగుఱ్ఱములు, మొసళ్ళు, మరియు సముద్రములో లేక సముద్రము దగ్గర ఉండే ఇతర పెద్ద జంతువులను గూర్చి చెప్పుచున్నాడు.

తన్నినీమ్ (*thanninim*) ("మహా సముద్ర మత్స్యములు") అనునవి, అన్యజనుల పురాణగాధలలో వలె, దేవుడు ఓడించవలసినటువంటి శత్రువులు కావు. దీనికి విరుద్ధముగా, అవి ఆయన సృష్టిలో భాగముగా ఉండి అవి మంచి అని ప్రకటించబడ్డాయి. ఇతర జంతువుల వలె, అవి పునరుత్పత్తి చేసికొనే సామర్థ్యముతో ఆశీర్వదించబడినవి. దీనిని బట్టి అవి **ఫలించి అభివృద్ధి పొంది సముద్ర జలములను నింపుటకు** శక్తి పొందినవి. **అయిదవ దినము** ముగియుచుండగా, "ఆశీర్వాదము" అను అంశము ఆదికాండములోని ప్రధాన దైవసత్యములలో ఒకదానిగా పరిచయము చేయబడినది. తన సృష్టిలోని జీవులను ఆశీర్వదించాలనే దేవుని వాగ్దానముల యొక్క నెరవేర్పును గూర్చిన చరిత్రగా ఆదికాండము తరచుగా వివరించబడినది.

## దినము 6: జంతువులు మరియు మానవుడు సృష్టించబడ్డారు (1:24–31)

ఈ సమయములలో, అంతిమ దినము యొక్క వివరణ ఇవ్వబడినది. ముందు జరిగిన అయిదు దినముల కంటే ఆరవ దినమును గూర్చి ఎక్కువ వివరణ ఇవ్వబడినది. ఏలయనగా, దేవుని శక్తివంతమైన కార్యములు భూజంతువులు మరియు మానవుల సృష్టితో అత్యున్నత స్థితికి చేరుకొనినవి. మూడవ దినమున, ఆరిన నేల మరియు అన్ని రకముల ఆహారపు మొక్కలు కనిపించాయి. కనుక, ఆరవ దినము దానికి అనుగుణముగా నేలను నింపునట్లు, జంతువులు (1:24, 25) మరియు మానవుని (1:26–28) యొక్క సృష్టితో ఉన్నది. దీనికి అదనముగా, దేవుని కృపాసహితమైన వారముగా, దేవుడు పంటలను నియమించి, వాటి ద్వారా జంతువులకు మరియు మానవులకు మనుగడ కొరకు కావలసిన ఆహారము కలుగునట్లు చేసెను (1:29, 30). మొదటి అధ్యాయమంతటితో కలిపి ఈ భాగము దేవుడు తన సృష్టి యావత్తును "చాలా మంచిది" (1:31) అని చెప్పుటతో ముగియుచున్నది.

### నేల జంతువుల యొక్క సృష్టి (1:24, 25)

**24దేవుడు–వాటి వాటి జాతి ప్రకారము జీవముగల వాటిని, అనగా వాటి వాటి జాతి ప్రకారము పశువులను పురుగులను అడవి జంతువులను భూమి పుట్టించుగాకని పలికెను; ఆ ప్రకరమాయెను. 25దేవుడు ఆ యా జాతుల ప్రకారము అడవి జంతువులను, ఆ యా జాతుల ప్రకారము పశువులను, ఆ యా జాతుల ప్రకారము నేలను ప్రాకు ప్రతి పురుగును చేసెను. అది మంచిదని దేవుడు చూచెను.**

**వచనములు 24, 25**. ఈ రెండు వచనములలో, దేవుడు సృష్టించిన మూడు రకములైన భూజంతువులను (**జీవముగల వాటిని**) రచయత వివరించెను. (1) **పశువులు** అనునవి బహుశ, గడ్డి మరియు చిన్న పొదలను ఆహారముగా తీసికొను పెద్ద పెంపుడు జంతువులైయుండవచ్చు. (2) **ప్రాకు జంతువులు** అనునవి బహుశ, పురుగులు, పాములు, బల్లులు, మరియు ఇతర నాలుగు కాళ్ళ జంతువులైయుండవచ్చు. (3) **అడవి జంతువులు** అనునవి బహుశ, ప్రతివిధమైన అడవి జంతువులైయుండ వచ్చు. దేవుడు వాటన్నిటిని వాటి వాటి జాతి ప్రకారము చేసెను. ఏవిధముగా అయితే ఆయన మొక్కలను, వృక్షములను, సముద్ర జీవులను, పక్షులను క్రమపరచెనో, అదేవిధముగా ఆయన ఇప్పుడు అన్ని విధములైన భూజంతువులను రూపిందించెను. సృష్టికర్త యావత్తు సృష్టికి సరిహద్దులను పరిమితులను నియమించెను. తరువాత, తన కార్యములు

వాటంతట అవే కొనసాగునట్లు, ఆయన ప్రతి విధమైన మొక్కను మరియు జంతురాశిని సృజించే శక్తిగలవాటిగా చేసాడు. ఆయన తన కార్యమును చూచినప్పుడు అది **మంచిదని దేవుడు చూచెను.**

## దేవుని పోలికలో మానవుని యొక్క సృష్టి (1:26–28)

**[26]దేవుడు–మన స్వరూపమందు మన పోలికె చొప్పున నరులను చేయుదము; వారు సముద్రపు చేపలను ఆకాశ పక్షులను పశువులను సమస్త భూమిని భూమి మెడ పరాకు ప్రతి జంతువును ఏలుదురుగాకనియు పలికెను. [27]దేవుడు తన స్వరూపమందు నరుని సృజించెను; దేవుని స్వరూపమందు వాని సృజించెను; స్త్రీనిగాను పురుషునిగాను వారిని సృజించెను. [28]దేవుడు వారిని ఆశీర్వదించెను; ఎట్లనగా–మీరు ఫలించి అభివృద్ధిపొంది విస్తరించి భూమిని నిండించి దానిని లోపరచుకొనుడి; సముద్రపు చేపలను ఆకాశ పక్షులను భూమిమీద ప్రాకు ప్రతి జీవిని ఏలుడని దేవుడు వారితో చెప్పెను.**

**వచనము 26**. నరుని సృష్టించుటతో, ఆరంభములను గూర్చిన చరిత్ర ఒక ఉచ్ఛస్థితికి చేరుకొనెను. ఏలయనగా, దేవుడు అతనిని **తన స్వరూపమందు** (צֶלֶם, *tselem*) మరియు తన **పోలికచొప్పున** (דְּמוּת, *d$^e$muth*) సృష్టించెను. మానవుడు భౌతికముగా దేవునివలె లేడు. అయితే, ఆయన సృష్టి అంతటిలో ప్రజలు మాత్రమే ఆయన యొక్క ఆత్మీయ, మేధస్సుకు సంబంధించిన, మరియు నైతిక గుణములను పంచుకుంటున్నారు.

**దేవుడు** (אֱלֹהִים, *'Elohim*) అను మాటకు హెబ్రీ పదము బహువచనములో ఉన్నది. ఆదికాండము యొక్క రచయిత, అన్యుల పురాణ గాథలలో వలె, అనేక దేవుళ్ళు ఉన్నారని నమ్మకపోయినను, అతను చేసెను అను క్రియాపదము యొక్క ఉత్తమ పురుష బహువచన రూపమును వాడెను. "దేవుడు" అను బహువచన పదముకు అనుగుణముగా ఈ క్రియాపదమును కూడా అతను బహువచనములో వాడెననుటలో సందేహము లేదు. అయినా కూడా, దీనికి కారణము ఏమిటో అనే విషయము ఎంతగానో వివాదమునకు గురియైనది. మరి ప్రత్యేకముగా, ఆదికాండము 1లోని ఇతర చోట్ల ఇదే క్రియాపదము ఏకవచనములోనే ఉండి, బహువచన నామవాచకమైన *'Elohim* పదమునకు వాడబడినది.[13]

ఒక ప్రముఖ ఆలోచన ఈ విధముగా ఉన్నది. దేవుని గుణముల మరియు శక్తుల యొక్క సంపూర్ణత దేవత్వమందు ఏకమైయున్నవని పురాతన ప్రజలు అనుకోనిరి. ఇటువంటి దేవుని మహాత్మ్యమును ప్రాముఖ్యముగా చూపుటకే రచయితా బహువచన పదములను 1:26లో ఉపయోగించెనని వీరి ఆలోచన. ఏదేమైన, ఒక శాశనమును జారీ చేయుటలో ఒక సార్వభౌముడు ఇటువంటి

బహువచన పదములను ఉపయోగించెనని, ఈ లేఖనభాగములో తప్ప లేఖనములంతటిలో మరి ఎక్కడా కనిపించుటలేదు.[14] పైగా, దేవుని యొక్క రాచరికపు ఘనతను చూపించుట కొరకే ఇక్కడ బహువచనము వాడబడినదను ఆలోచన అంట ఆమోదయోగ్యమైనదిగా లేదు. ఏలయనగా, ఈ లేఖనభాగము యొక్క ముఖ్యాంశము దేవునికి మరియు మానవునికి మధ్య ఉన్న ప్రత్యేకమైన సంబంధమును గూర్చినది. ఇక్కడ దృష్టి అంటా సృష్టికర్త యొక్క పోలికలో జీవి చేయబడుట పైనే ఉన్నది కానీ, దేవుని లక్షణముల యొక్క మహాత్మ్యముపై మాత్రము కాదు.

పైన వివరింపబడిన అభిప్రాయమునకు అదనముగా, మరికొందరు దేవుని గూర్చిన ఈ బహువచనము యొక్క ఉపయోగమును **(మనము మరియు మన)** పాతనిబంధనలో త్రిత్వము యొక్క సిద్ధాంతమును గూర్చిన ఋజువుగా చూస్తారు. అయితే, క్రీ.పూ. రెండవ శతాబ్దము వచ్చిన తరువాత మాత్రమే క్రైస్తవులు ఆదికాండము 1:26ను దేవత్వములోని తండ్రి, కుమారుడు, మరియు పరిశుద్ధాత్మ యొక్క బహుళత్వమును గూర్చి సూచించుచున్నట్లు వాడుకొనిరి. క్రొత్తనిబంధనలో ఈ సిద్ధాంతమునకు చాలా మద్దతు ఉంది.[15] అయినాకానీ, ప్రేరేపించబడిన ఏ రచయిత కూడా ఎన్నడూ “మనము” మరియు “మన” అని సృష్టిని గూర్చిన చరిత్రలో ఉన్న పదప్రయోగము దేవత్వములోని ముగ్గురిని గూర్చిన భావనను సూచిస్తున్నట్లు చెప్పలేదు. ఇటువంటి వ్యాఖ్యానానికి బైబిలులో ఏ దృష్టాంతమూ లేదు కనుక అట్టి వ్యాఖ్యానముతో వాదించుటకు జాగ్రత్తకలిగియుండేలా చేస్తుంది.

మనము త తీవ్రముగా పరిగణించవలసినటువంటి 1:26 యొక్క ఒక అంతిమ అర్థము ఉన్నది. పాతనిబంధనలోని దేవుడు తరచుగా ఒక గొప్ప రాజు అని చెప్పబడ్డాడు. ఆయన తన సింహాసనముపై ఆసీనుడైయుండగా, ఆయన చుట్టూ పరలోకపు దూతల సమూహము కూడియుండేవి. ప్రవక్తయైన మీకా మాటలలో, “యెహోవా సింహాసనాసీనుడైయుండగా పరలోకసైన్యమంతయు ఆయన కుడిపార్శ్వమునను ఎడమపార్శ్వమునను నిలిచి యుండుట నేను చూచితిని.” “ఆహాబు రామోత్గిలాదుమీదికి పోయి అక్కడ ఒడిపోవునట్లుగా ఎవడు అతనిని ప్రేరేపించునని” యెహోవా పరలోకపు దూతలను సవాలు చేసెను (1 రాజులు 22:19, 20). వెంటనే, ఒక దేవదూత ముందుకు వచ్చి, ఉత్తర రాజ్యమైన ఇశ్రాయేలు యొక్క దుష్ట రాజు అయిన ఆహాబుపై తీర్పు తెచ్చే కార్యము కొరకు స్వచ్ఛందముగా ముందుకు వచ్చెను. తన పరలోకపు సభ చుట్టూ ఉన్న సార్వాభౌముడైన రాజుగా ఉన్న దేవుని గూర్చిన దృశ్యము కీర్తనలు 89:5–7లో ఉన్నది. “పరిశుద్ధదూతల సమాజములో” పరలోకస్థలములలో యెహోవాను స్తుతించును అని కీర్తనాకారుడు చెప్పుచున్నాడు. మరియు అతను “దైవపుత్రులలో” (పరలోక జీవులు; KJV; NRSV) ఎవరు కూడా యెహోవాను

సాటిరారు అని చెప్పుచున్నాడు. ఏలయనగా "పరిశుద్ధదూతల సభలో ఆయన మిక్కిలి భీకరుడు."

అంతిమముగా, యెషయా 6:1–8లో దేవునిని ఒక గొప్ప రాజుగా చిత్రించుచూ, "అత్యున్నతమైన సింహాసనమందు ప్రభువు ఆశీనుడైయుండగా నేను చూచితిని; ఆయన చొక్కాయి అంచులు దేవాలయమును నిండుకొనెను" అని వివరించుచున్నాడు. ఆయన చుట్టూ సెరాపులు (దేవదూతలు) ఉండిరనియు, వారు ఆయనను స్తుతించుచు, ఆయన చిత్తమును చేయుటకు సిద్ధముగా నిలువబడియుండిరనియు చెప్పబడెను (యెష. 6:1–3, 6, 7). "మా నిమిత్తము ఎవడు పోవును" (యెష. 6:8) అని యెషయా దేవుని స్వరము వినిన దాని గూర్చిన వివరణలో, దేవుని ప్రశ్నలో "మా" అను బహువచనపు మాటలో పరలోకపు దూతల సభ కూడా కలిసియుండినదను విషయము విదితమే.

పైన వివరించబడిన లేఖనభాగముల యొక్క వెలుగులో, ఆదికాండము 1:26ను త్రిత్వమును సూచిస్తుందని అర్థము చేసికొనుటకు బదులుగా, దేవుడు మరియు ఆయన దూతల సమూహముతో సహా కార్యము చేయుచుండుటను సూచిస్తుందని చెప్పటయే సరియైనదిగా అనిపించుచున్నది. కాబట్టి, దేవదూతలు సృష్టిని సృష్టించుటలో దేవునితో పాలుపంచుకొనిరి. అయితే, వారు దేవునితో సహ సృష్టికర్తలు అని దీని భావము కాదు. దేవుడు చేయుదానినంతటిని చూస్తూ దానిన్ బట్టి ఆయనను స్తుతించుట ద్వారా వారు పాలుపొందిరి అని భావము. "నేను భూమికి పునాదులు వేసినప్పుడు నీవెక్కడ నుంటివి? ... ఉదయనక్షత్రములు ఏకముగా కూడి పాడినప్పుడు దేవదూతలందరును ఆనందించి జయధ్వనులు చేసినప్పుడు దాని మూలరాతిని వేసినవాడెవడు?" అని యోబును దేవుడు కవితాత్మకముగా ప్రశ్నించినప్పుడు ఈ దేవదూతలను ఆయన ప్రస్తావించెను (యోబు 38:4–7).[16]

**వచనము 27**. 26వ వచనము దేవుని మాటలు ఉన్నది ఉన్నట్లుగా చెప్పబడగా, ౨౭వ వచనము మాత్రము రచయిత యొక్క మాటలైయున్నవి. అతను తన ప్రధాన అంశమును నొక్కి చెప్పుటకు ABBA పద్ధతిలో పునరావృతము యొక్క శైలిని ఉపయోగించెను:

A1: **దేవుడు నరుని సృజించెను**
  B1: **తన స్వరూపమందు,**
  B2: **దేవుని స్వరూపమందు**
A2: **ఆయన వానిని సృజించెను.**

దేవుడు సృష్టించిన మానవులలో దేవుని యొక్క "స్వరూపము" (*tselem*) మరియు "పోలిక" ($d^e$*muth*; 1:26) ఏ విధముగా కనిపిస్తాయి? ఈ భావనను

వివిధ రీతులలో అర్థము చేసికొనడము జరిగినది.

*Tselem* అను మొదటి పదము, సాధారణముగా విగ్రహములను సూచిస్తుంది. ఇటువంటి స్వరూపములు యెహోవా యొక్క ధర్మశాస్త్రములో ఎంతో కఠినముగా నిషేధించబడ్డాయి[17] (సంఖ్యా. 33:51, 52). ఏదేమైనా, పాతనిబంధన చరిత్రలోని అధిక భాగము, దేవుని ప్రజలు అబద్ధ దేవుళ్ళను విడిచిపెట్టుటకు నిరాకరించిరి. అందునుబట్టే యెహోవా యెరూషలేము మరియు యూదలకు అంతమును నిర్ణయించి, తన విగ్రహారాధకూలిన ప్రజలు వారి విగ్రహములతో సహా నాశనమగుటకు అనుమతించెను (యెహెజ్కేలు 7:3, 20, 24–27).

ఆదికాండము 5:3 *tselem* ("స్వరూపము") అను మాటను భౌతిక పోలిక అనే భావముతో వాడుతుంది, మరియు ఇందులో 1:26లో ఉన్న *d<sup>e</sup>muth* ("పోలిక") అను మాట కూడా ఉంది. ఆదాము యొక్క వంశావళులను గూర్చి చర్చించుకుంటున్నప్పుడు, రచయిత "ఆదాము నూట ముప్పది యేండ్లు బ్రదికి తన పోలికెగా [*d<sup>e</sup>muth*], తన స్వరూపమందు [*tselem*] కుమారుని కానీ అతనికి షేతు అను పేరు పెట్టెను" అని అన్నాడు (5:3). ఈ వాక్యము యొక్క అతి సాధారణమైన భావము ఏదనగా, తండ్రీకొడుకులు మధ్య ఎంతగానో భౌతిక పోలిక ఉండినది. *Tselem* మరియు *d<sup>e</sup>muth* అను రెండు పదములు, తండ్రీకొడుకులు ఒకేలా ఉన్నారనే భావనను తెలియజేస్తుంది.

మరికొన్ని వాక్యభాగములలో, *tselem* అను పదము ఒక నిర్దిష్టమైన భాగము కలిగిలేదు. కానీ, ఏదో ఇంకా ఎక్కువ ఆత్మీయ స్వభావము కలిగిన దానిని గూర్చి ఇది మాట్లాడుతుంది. ఒక కీర్తనాకారుడు, జీవితమూ యొక్క క్షణికతను గూర్చి మాటలాడుచు, దేవుని సృష్టిలో అతని జీవితకాలము లేనట్లే ఉన్నదని పోతున్నాడు:

> ఎంత స్థిరుడైన ప్రతివాడును కేవలము వట్టి ఊపిరివలె [הֶבֶל, *hebel*] ఉన్నాడు.
> మనుష్యులు వట్టి నీడవంటివారై [*tselem*] తిరుగులాడుదురు.
> వారు తొందరపడుట గాలికె [*hebel*] గదా
> వారు ధనమును కూర్చుకొందురు గాని
> అది ఎవనికి చేజిక్కునో వారికి తెలియదు (కీర్తన 39:5, 6).

39వ కీర్తనలో "నీడ" అని అనువదించబడ్డ *tselem* అను పదము, "ఊపిరి" మరియు "గాలి" అని అనువదించబడిన *hebel* అను పదమునకు సరిసమానముగా ఉన్నది. ఈ రెండు హెబ్రీ పదములు కూడా భౌతికము కానటువంటి దానిని గూర్చి చెబుతున్నాయి.

ఇదేవిధముగా, కీర్తన 73:20లో, ఒక కీర్తనకారుడు దుష్టులను "మేలుకొనినవాడు [הָלֹם, *ch<sup>a</sup>lom*] తాను కన్న కల మరచిపోవునట్లు" అని వివరించుచున్నాడు మరియు దేవుడు, "వారి బ్రదుకును [*tselem*]

తృణీకరించును" అని చెప్పుచున్నాడు. ఇక్కడ, "కల" (*ch^a lom*) అను మాట "రూపము" (*tselem*) అను మాటకు సరిసమానముగా ఉన్నది. ఇదే మాట "నీడ" (NRSV) మరియు "ఊహలు" (NIV) అని అనువదించబడినది. కనీసము కొన్ని సందర్భములలో, *tselem* అను మాట భౌతికము కానటువంటిదాని గురించి మాటలాడుచున్నదని ఇది సూచిస్తుంది. ఆ పదము ఒక నిర్దిష్టమైన రూపము లేక కేవలము ఆత్మీయ స్వభావము గల దానిని సూచిస్తుంది.

మానవునిలో దేవుని పోలికను వివరించుటకు ఉపయోగించిన మరియొక పదము "పోలిక" (*d^e muth*; 1:26). ఇది కూడా భౌతిక పోలికను గూర్చిన భావమును కలిగియున్నది. యెషయా 40:18, 19 లోని ఒక ప్రశ్నలో ఇది కనిపించుచున్నది. భూమ్యాకాశములలో ఏదియు తనతో పోల్చుకొనజాలదని ఇక్కడ దేవుడు చెప్పెను. ఈ లేఖనములో, క్రియాపదము మరియు అదే మూల పదము నుండి వచ్చిన దాని నామవాచక రూపము (*d^e muth*) ఒక దాని తరువాత ఒకటి కనిపిస్తాయి:

> కావున మీరు ఎవనితో దేవుని పోల్చుదురు [*damah*]?
> ఏ రూపమును [*d^e muth*] ఆయనకు సాటిచేయగలరు?
> విగ్రహమును చూడగా శిల్పి దానిని పోతపోయును
> కంసాలి దానిని బంగారు రేకులతో పొదుగును
> దానికి వెండి గొలుసులు చేయును.

మరో విధముగా చెప్పాలంటే, మానవుని ద్వారా నిర్మించబడిన ఏ భౌతిక చిత్రము లేక రూపము కూడా దేవుని యొక్క నిజమైన స్వభావమును తెలియజేయలేవు.

పది ఆజ్ఞలలో, దేవుని యొక్క ఏ విగ్రహమునైనను, ఆకాశమందు గాని లేక భూమిపైనున్న ఏ రూపమునైనను చేయుటకు ఇశ్రాయేలీయులను దేవుడు నిషేధించెను (నిర్గమ. 20:3–5; ద్వితీ. 5:7–9). ఇశ్రాయేలీయులు వాగ్దాన దేశములోనికి ప్రవేశించకముందు, ఈ విషయములో జాగ్రత్తగా ఉండవలెనని మోషే వారిని హెచ్చరించెను: "హోరేబులో యెహోవా అగ్నిజ్వాలల మధ్యనుండి మీతో మాటలాడిన దినమున మీరు ఏ స్వరూపమును చూడలేదు" (ద్వితీ. 4:15; ఉద్ఘాటన కలుపబడెను). వారు మానవుల (స్త్రీ గాని పురుషుడు గాని) యొక్కయు, జంతువుల యొక్కయు (మృగములు, ప్రాకు జీవులు, పక్షులు, లేక చేపలు), లేక ఆకాశపు సమూహము యొక్కయు (సూర్యుడు, చంద్రుడు, లేక నక్షత్రములు) పోలిక లేక రూపములో "ప్రతిమ"ను చేయకూడదు (ద్వితీ. 4:16–19).

అయినప్పటికీ, చేతులు (కీర్తన 10:12, 14), కాళ్ళు (యెష. 60:13), ముఖము, కళ్ళు, మరియు చెవులు (కీర్తనలు 34:15, 16) కలిగినవాడై, ఒక సింహాసనముపై ఆసీనుడైన రాజు వలే దేవుడు తరచుగా చిత్రించబడెను. భౌతిక

శరీరము దేవుని రూపములో చేయబడెనని భావము వచ్చునట్లుగా ఈ పదబంధములు తరచూగ వ్యాఖ్యానించబడినవి; కానీ, అవి దేవుని గూర్చినటువంటి అలంకారిక (figurative) వివరణలైయున్నవి. వాటిని అక్షరాలా తీసుకోరాదు. శరీరము కాకుండ, ఆత్మయైన (యోహాను 4:24; లూకా 24:39 చూడుము) దేవుని స్వభావమును గూర్చిన అపార్థములకు ఇటువంటి వ్యాఖ్యానాలు ఉన్నాయి. అందుకే ఒక కీర్తనాకారుడు "నీ ఆత్మయొద్దనుండి నేనెక్కడికి పోవుదును? నీ సన్నిధినుండి నేనెక్కడికి పారిపోవుదును? నేను ఆకాశమునకెక్కినను నీవు అక్కడను ఉన్నావు. నేను పాతాళమందు పండుకొనినను నీవు అక్కడను ఉన్నావు" (కీర్తనలు 139:7, 8).

దేవుని ఆత్మీయ స్వభావము మానవుని భౌతిక స్వభావమునకు వ్యతిరేకముగా ఉన్నది. "దేవుడు తన స్వరూపమందు నరుని సృజించెను" అను ప్రతిపాదన (మానవునిలో ప్రతిరూపించింది) దేవుని ఆత్మీయ స్వభావమును గూర్చి చెప్పుచున్నది. అయితే, **స్త్రీనిగాను పురుషునిగాను** వారిని సృజించెను అనునది మానవుని భౌతిక స్వభావమును ఉద్ఘాటించుచున్నది. ఈ వాక్యభాగములో "నరుడు" అనుదానికి ఉపయోగించిన పదము אָדָם (*'adam*). దీని హెబ్రీ పదం యొక్క సాధారణం వాడుక పద భావము "మానవజాతి" మరియు ఇది తదనంతరము "ఆదాము" అను వ్యక్తిగత పేరుగా మారినది (2:20; 3:17, 21). ఏదేమైనా, ఇక్కడ మరియు ఆదికాండము 5:1, 2లో *'adam* అను పదము "పురుషుడు మరియు స్త్రీ"లను మూలమునందు కలిగియున్నది. ఏలయనగా, వారిరువురు కూడా దేవుని స్వరూపమందు ఆయన పోలికలో సృష్టించబడ్డారు. పురుషుడు మరియు స్త్రీలు భౌతికముగా మరియు లైంగికముగా ఒకరికి భిన్నముగా ఒకరు ఉంటారు. కనుక, పురుషుడు మరియు స్త్రీలలో (*'adam*, "మానవజాతి") దేవుని పోలిక అనునది భౌతిక స్వభావము లేక రూపము కాక వేరొకదానిని సూచించవలెను. నైతిక సున్నితత్వము, ఆత్మీయ జీవము, మరియు జ్ఞానసంబంధమైన లక్షణములు కేవలము మానవుడు మాత్రమే సృష్టికర్తతో పంచుకుంటాడు. దేవుడు చేసిన ఇతర జీవులలో ఈవిధముగా జరుగదు. మానవునిలో దేవుని పోలిక అనునది దీనినే సూచిస్తుంది.

**వచనము 28.** దేవుడు మానవునిని తన సొంత స్వరూపములో పురుషునిగాను మరియు స్త్రీనిగాను సృష్టించినప్పుడు, ఆయన వారిని **ఆశీర్వదించెను మరియు ఫలించి అభివృద్ధిపొంది విస్తరించి భూమిని నిండించి దానిని లోపరచుకొనుడి** అని వారికి ఆజ్ఞాపించెను. ఈ కార్యములో, దేవుడు మానవజాతిపై ఆశీర్వాదములు కుమ్మరించుటయే కాక, ఫలించి అభివృద్ధి పొందునట్లు దేవుడు వారికి సామర్థ్యమును కూడా అనుగ్రహించెను. పక్షులకు మరియు సముద్రజీవులకు కూడా 1:22లో ఆయన ఈ విధముగానే చేసెను. పునరుత్పత్తి చేయుటతో సంబంధము కలిగియున్న, పురుషుడు మరియు స్త్రీకి ఉన్న లైంగిక

సాన్నిహిత్యము యొక్క ఆశీర్వాదము అనునది ప్రకృతి యొక్క ఆకస్మికము కాదు లేక ఒక జీవశాస్త్రము యొక్క సంఘటన కాదు. అలాగే, ఏదేను తోటలో పాపమునకు ఇది దారి తీయలేదు. పాపమునకు శిక్షగా కూడా ఇది రాలేదు.

దేవుడు మానవజాతిలో అంతరంగికముగా నిర్మించిన లైంగిక కోరికను ఆత్మీయము కానిదిగా, అనైతికముగా, లేక దుష్టమైనదిగా చిత్రించుటకు ప్రయత్నించే ఏ ప్రయత్నము కూడా బైబిలు యొక్క బోధనకు వ్యతిరేకముగా ఉన్నది. ఇది దేవుని సృష్టిలో భాగము. ఆయన తానూ చేసినదానినంతటిని గూర్చి ఆలోచించుకొనుచుండగా, దీనిని దేవుడు "చాలా మంచిది" అని ప్రకటించెను (1:31). శృంగారము పాపము కాదు కానీ దానిని తప్పుగా వాడుకొనుటయే పాపము. మరియు, వివాహములో ఒక వ్యక్తి మరొక వ్యక్తిని తన కామవాంఛను తీర్చుకొనుటకు శృంగారమును వస్తువుగా వాడుకొనినప్పుడు, వివాహము విషయములో సహితము ఇది సత్యముగా ఉండుటకు అవకాశము ఉన్నది. లైంగికపరమైన గుర్తు మరియు దాని ఉద్దేషములు దేవుని స్వభావము మరియు క్రియల్లో భాగము కానప్పటికీ, పునరుత్పత్తి అనునది ఒక మంచి విషయముగా చేయబడినది. ఏలయనగా, అది వివాహము యొక్క దైవిక ఉద్దేశమై, ఆయన స్వరూపములో చేయబడిన పురుషుడు మరియు స్త్రీల పట్ల దేవుని చిత్తముగా ఉన్నది.

"ఫలించి అభివృద్ధిపొంది విస్తరించి భూమిని నిండించి దానిని లోపరచుకొనుడి" అని దేవుడు ఇచ్చిన ఆజ్ఞ పురాతన పునరుత్పత్తి మతములకు చాలా విరుద్ధముగా నిలుచుచున్నది. ఈ దిగజారిన మతాచారాలతో కూడిన నీచపరచు వ్యభిచార క్రియలు, దేవతలను శృంగార కార్యకలాపములు చేయుటకు పురికొల్పబడవలసిన ఉద్దేశము కలిగియున్నవి. దీని వలన మానవజాతి, జంతువులు, మరియు పంటలు ఫలభరితమవ్వాలని వీటి యొక్క ఉద్దేశము. ఇటువంటి మతములలో పాలుపంచుకొనుటకు దేవుని ఆజ్ఞ మరియు ఆశీర్వాదము అవసరము లేనిదిగా చేశాయి. అంతేకాకుండా, ఇటువంటి హీనమైన అలవాట్లు అవిశ్వాసమునకు మరియు పాపమునకు తొలగిపోవుట యొక్క అంతిమ చిహ్నముగా ఉన్నవి. అద్వితీయుడగు నిజ సృష్టికర్త మరియు జీవమును కాచువాడును కొనసాగించువాడునై యున్నవానినుండి హీనమైన విగ్రహారాధన యొక్క అలవాట్లకు తొలగిపోయి మరియు మానవునిలోని దేవుని స్వరూపమును పాడుచేయునవిగా ఇవి ఉన్నాయి. ఇటువంటి నీచమైన అలవాట్లకు విరుద్ధముగా, పురుషుడు మరియు స్త్రీ యొక్క వివాహము ఆదినుండి మానవునికి దేవుడు ఇచ్చిన బహుమానము; మరియు ఇది వారిపై మరియు వారి సంతానముపై ఒక ప్రత్యేకమైన ఆశీర్వాదముతో వచ్చినది.

ఆశీర్వాదమును గూర్చిన భావనను తేలికగా తీసికొనకూడదు. ఆదికాండములో ఉన్న అతిముఖ్యమైన అంశములలో ఇది ఒకటైయున్నది.

ప్రాథమికముగా, సంతానముతో, మరియు భూమిని నింపునటువంటి ఫలముతో ఈ ఆశీర్వాదము సంబంధము కలిగియుంది. అయితే, మానవుని "బీజము" ఇదివరకే ఆశీర్వాదముతో ముడిపడి ఉంది. అంతేకాకుండా, ఈ భావన, ఆదికాండము యొక్క మిగిలిన భాగముపై ఆధిపత్యము చూపుచున్నది. అనేకమైన వ్యక్తులకు ఈ ఆశీర్వాదము ఇవ్వబడినది–అది వారికొరకు మాత్రమే కాదు కానీ, సర్వప్రపంచమునకు దేవుని మంచి బహుమానములు ఇచ్చే మాధ్యమములుగా సేవ చేయుటకు ఇవ్వబడినది.

పునరుత్పత్తి ద్వారా భూమిని నింపుటకు అదనముగా, పురుషుడు మరియు స్త్రీలకు దేవుని రెండవ ఆజ్ఞ ఏమనగా దానిని లోపరచుకొనుడి; సముద్రపు చేపలను ఆకాశ పక్షులను భూమిమీద ప్రాకు జీవిని ఏలుడి (1:26 చూడుము). "లోపరచుకొనుడి" అని అనువదించబడిన మొదటి పదము כָּבַשׁ (*kabash*). ఇది భూమిని సూచిస్తుంది మరియు లోపరచుకొ నుట జరుగు ప్రక్రియలో శక్తి మరియు అడ్డగించునవి కలగలిపి ఉంటాయని ఇది సూచిస్తున్నది.[18]

*Kabash* అను పదము ఈ విధంగా అనేక బైబిల్ భాగములలో ఉపయోగించబడినది. ఉదాహరణకు, హామాను తన భార్య అయిన ఎస్తేరుపై దాడి (బలాత్కారము) చేయుటకు ప్రయత్నిస్తున్నాడని రాజైన ఆహష్వేరోషు తలంచాడు (ఎస్తేరు 7:8). ఈ పదము కనాను దేశములోని పట్టణములపై దాడి చేసి వాటిని స్వాధీనపరచుకొనిన సందర్భములో కూడా ఉపయోగించబడింది (సంఖ్యా. 32:22; యెహోషువ 18.1). అంతేగాక, బానిసత్వమునకు గురైన యూదా ప్రజలను కూడా ఇది వర్ణిస్తుంది (2 దిన. 28:10; నెహెమ్యా. 5:5; యిర్మీయా 34:11).

*Kabash* అను క్రియా పదము తరచుగా మానవ సంబంధములలో బలాత్కారముతో సంబంధము కలిగియున్నను, ఆదికాండము 1 యొక్క సందర్భము ప్రజలను లోపరచుకొనుటను గూర్చి కాదు కానీ భూమిని లోబరచుకొనుటకు గూర్చియైయున్నది. భూమి మానవుని చిత్తమునకు సులభముగా ప్రతిస్పందించదని ఆదికాండము 1:28 యొక్క అంతర్భావము కనిపించుచున్నది; అతను సృష్టిని తన బలిమి చేత లోబడునట్లు చేసికొనవలెను. 2:5, 15లలో[19] భూమిని సేద్యపరచుట మరియు కాయుట అను భావమునకు సమాంతరముగా ఇక్కడ "స్థిరపడుట మరియు వ్యవసాయము"లను గూర్చి సూచించబడిందని Victor P. Hamilton అనుకొనెను.

దేవుడు మానవజాతికి ఇచ్చిన హితవులో తదుపరి భాగము "సముద్రపు చేపలను ఆకాశ పక్షులను భూమిమీద ప్రాకు ప్రతి జీవిని ఏలుడని దేవుడు వారితో చెప్పెను." ఆదికాండము 1:28 ఈ జీవులన్నిటిపై మానవుని పరిపాలనను చూపించు పదము רָדָה (*radah*). ఇది సాధారణముగా "దేవుని ఏలుబడి కంటె మానవుని ఏలుబడి కొరకు"[20] ఉపయోగించబడెను. దీనికి ఒక ఉదాహరణ కీర్తనలు 110:2లో ఇవ్వబడినది. తన శత్రువుల నడుమ ఏలుబడి (*radah*) చేయవలెనని

ఇక్కడ దేవుడు సీయోనులోని రాజును ఉద్బోధించాడు. వారు చెరపట్టబడిన వారి శత్రువులపై ఇశ్రాయేలీయులు చేయుచుండిన ఏలుబడిని గూర్చి కూడా ఈ పదము ఉపయోగించబడెను (యెష. 14:2). ఇతర ప్రజలను లోంగదీసికొని వారి అణచివేసే పరిపాలనకు వారిని లోబరచుకొనిన అన్యజనుల విషయములో కూడా ఈ పదము ఉపయోగించబడెను (యెష. 14:6).

*Radah* ఒక రాచరికపు పదము. ప్రజలపై పరిపాలనను మరియు ఆధిపత్యమును ఇది సూచిస్తుంది. ఏదేమైనా, దేవుని ప్రజలు ఇట్టి అధికారమును చూపించుటలో కఠినముగా ఉండకూడదు. లేవీయకాండము 25:43లో ఒక యజమాని తన దాసుని కఠినముగా చూడకూడదు (*radah*) అని చెప్పబడినది. సొలొమోను, కనీసము తన పరిపాలన యొక్క ఆరంభ సంవత్సరములలో, ఇశ్రాయేలు చుట్టూ ఉన్న తన సొనంత రాజ్యములపై శాంతిపూర్వకరమైన ఆధిపత్యమును (*radah*) కలిగియుండెను (1 రాజులు 4:24). పరిపాలించుచుండిన రాజు నీతి న్యాయములతో, అవసరతలోను బాధలోను ఉన్నవారిని విడిపించుచు, పేదలపై కనికరముతో వారి జీవితములను రక్షించుచు, నిస్సహాయులను అణచివేత నుండి కాపాడుతూ, తన ఆధీనములో ఉండిన ప్రజలకు శాంతిని తెస్తూ తన పరిపాలనను (*radah*) చూపునట్లు కీర్తనాకారుడు ప్రార్థించెను (కీర్తనలు 72:1-3, 7, 8, 12–14).

స్పష్టముగా ఇటువంటి ఆధిపత్యమునే (*radah*) దేవుడు ఆదియందు మానవాళికి అప్పగించెను. ప్రకృతి వనరులను మానవుడు వినియోగించుకొనుటను న్యాయబద్ధం చేస్తుంది. అయితే, దేవుని సుందరమైన లోకమును దుర్వినియోగము చేయుటకు ఇది మానవునికి అనుమతి ఇవ్వదు. మానవుడు ప్రకృతిపై మరియు జంతురాశిపై ఉంచబడినను, అతను దేవుని క్రింద ఉన్నాడని మరియు అతను వాటిపై తన పరిపాలనను, కఠినముగా దోచేకొనే విధముగా కాకుండా, వాటి క్షేమము నిమిత్తము చింతతో జరిగించవలెనని అతను ఎల్లప్పుడూ జ్ఞాపకము ఉంచుకొనవలెను. మానవుడు భూమిని మరియు దాని జీవులను పరిపాలించు విధానములో, దేవుని యొక్క ఉదార స్వభావమును (స్వరూపమును) ప్రతిబింబింపజేయవలెను. మానవుడు జంతువులను మరియు భూమిని లోబరచుకొనవలెనని దేవుని ఆజ్ఞ. అయితే, అతను వాటిపై కనికరముతో మరియు బాధ్యతాయుతమైన విధానములో, తన యజమానుని ఆస్తిని నిర్వహించుచున్న ఒక గృహనిర్వాహకుని వలె పరిపాలన చేయవలెను.

## మానవజాతికి మరియు జంతువులకు దేవుడు ఆహారమును సిద్ధముచేయుట (1:29, 30)

**29 దేవుడు–ఇదిగో భూమిమీదనున్న విత్తనములిచ్చు ప్రతి చెట్టును**

**విత్తనములిచ్చు వృక్షఫలములుగల ప్రతి వృక్షమును మీ కిచ్చియున్నాను; అవి మీ కాహారమగును. [30]భూమిమీదనుండు జంతువులన్నిటికిని ఆకాశ పక్షులన్నిటికిని భూమిమీద ప్రాకు సమస్త జీవులకును పచ్చని చెట్లన్నియు ఆహారమగునని పలికెను. ఆ ప్రకారమాయెను.**

**వచనములు 29, 30.** ఆదికాండము యొక్క రచయిత సృష్టిని గూర్చిన చరిత్రను వివరిస్తూ, ప్రతి చెట్టును మరియు **వృక్షఫలముగల ప్రతి వృక్షమును** వారి మేలు కొరకు సృష్టించుట ద్వారా దేవుడు తాను సృజించినవాటన్నిటికొరకు **ఆహారము** దయచేసెను అని పునరుద్ఘాటించు చున్నాడు. మానవులు "దేవతల సేవ కొరకు"[21] అనగా, వారికి ఆహారము దయచేయుటకొరకు సృష్టించబడిరనే మెసొపొతమియ అభిప్రాయమునకు ఆదికాణ్డములోని ఈ ప్రతిపాదనము ఎంతో భిన్నముగా ఉన్నది. ఇది గిల్గామేష్ పురాణములో స్పష్టముగా కనిపించుచున్నది. ఏలయనగా, మానవజాతిని నాశనము చేయుటకు దేవతలు జలప్రళయమును పంపించిన తరువాత, వారిని పోషించుటకు వారికి ఎవరూ లేకపోయిరి. Utnapishtim (నోవాహు వంటి బబులోనీయుడు), పడవలోనుండి బయటికి వచ్చి బలియర్పణ చేసినప్పుడు, దేవతలు ఎంత ఆకలిగొనియుండిరంటే, వారు దాని చుట్టూ, "ఈగలవలె ముసురుకొనిరి."[22]

దేవుడు మానవులకు మరియు జంతువులకు, పచ్చని చెట్లన్నియు ఆహారమగును అని చెప్పినప్పుడు, అన్ని జీవులు కేవలము చెట్లను మాత్రమే ఆహారముగా తీసికొనవలెనని దీని భావము. "అన్ని చెట్లు సమానముగా అందరికి పోషకసహితమైనవి అని కాదు, ఇది సాధారణముగా చెప్పబడిన విషయము. ప్రత్యక్షముగా కానీ లేక పరోక్షముగా కానీ సమస్త జీవరాశి ఆహారమునిచ్చు వృక్షములపై ఆధారపడి ఉన్నాయి, మరియు, అందరు దేవుని హస్తమునుండి పోషింపబడుచున్నారని చూపించుటయే ఈ వచనము యొక్క ఉద్దేశము."[23] తప్పనిసరిగా, జలప్రళయము తరువాత కానీ మాంసము తినుట ప్రత్యేకముగా అధికారికము చేయబడలేదు అనునది వాస్తవమే (9:2–4). ఏదేమైనా, ఈ సమయమునకు ముందు మాంసమును తినుటకు దేవుడు నిషేధించలేదు. ఆదాము మరియు హవ్వలు ఏదేను తోటలో పాపము చేసినప్పుడు వారికి బట్టలు తొలగించు నిమిత్తము దేవుడు చర్మపు చొక్కాయిలను చేసెనను విషయము కూడా గమనించవలసినది (3:21). ఈ సంఘటననుండి సహజముగానే ఒక ప్రశ్న ఉదయిస్తుంది: "దేవుడు మొదటి దంపతులకు ఏపైనా జంతువుల నుండి తినుటకు మాంసమును అనుగ్రహించెనా?" ఈ ప్రశ్న సమాధానము లేకుండా ఉండవలసియుండగా, ఇది నిజముగా సాధ్యమగుననుటను లేఖనభాగము అనుమతించదు.

దాదాపు మానవజాతి యొక్క ఆరంభము నుండి, దేవుని అనుమతితో

ఆయనకు బాల్యర్పణలు చేయబడుటను గూర్చి నమోదు చేయబడియున్నది (4:4). మరలా, తదుపరి కాలములో మోషే ధర్మశాస్త్రము క్రింద జరిగినట్లు, ఆరాధికుడు యెహోవా యొక్క బలిపీఠము యొద్ద అర్పించిన అర్పణలో కొంత భాగమును తిరినదానికి ఇది అంతర్భావముగా ఉన్నదా? జలప్రళయమునకు ముందే, ఓడలోనికి తెచ్చే జంతువులలో "పవిత్రములు" మరియు "అపవిత్రములు" అయిన జంతువుల సంఖ్య మధ్య భేదమును చూపమని దేవుడు నోవహుకు ఆజ్ఞలు జారీ చేసెను (7:2). తదుపరి కాలములో మోషే ధర్మశాస్త్రములో ఉన్న విధముగా, జలప్రళయమునకు ముంది, కేవలము "పవిత్ర" జంతువులను మాత్రమే దేవునికి అర్పించి మరియు మనుష్యులు తినాలని అనుటకు ఇది సూచించుచున్నదా? ఏ విధమైన స్పష్టమైన లేఖనాధారాములు లేకుండా, ఇటువంటి ప్రశ్నలకు ఎటువంటి స్పష్టమైన సమాధానములు ఇవ్వడము కష్టము. స్పష్టత లేకపోయినను ఒక అభిప్రాయమునకు వచ్చుట విషయములో అవకాశము ఇవ్వబడవలెను. అయితే, లోకములోనికి పాపము వచ్చిన తరువాత, దేవుడు తన ప్రజలకు చంపుటను గూర్చియు, బలియర్పణను గూర్చియు, మరియు బహుశ జంతుబలులను తిను విషయములోను దేవుడు కొన్ని సూచనలు చేసెనని ఈ లేఖనభాగములు సూచించుచున్నట్లుగా ఉంది. లేఖనములలో దీనిని గూర్చి నమోదైన ఏకైన ఖచ్చితమైన సమాచారము జలప్రళయము యొక్క కాలము నుండి వచ్చుచున్నది.

## సృష్టిని గూర్చి దేవుని అంచనా (1:31)

**31దేవుడు తాస్ చేసినది యావత్తును చూచినప్పుడు అది చాల మంచిదిగ నుండెను. అస్తమయమును ఉదయమును కలుగగా ఆరవ దినమాయెను.**

**వచనము 31**. దేవుడు మెచ్చుకొనినటువంటి ఇదే విధమైన పదములు ఆదికాండము 1:4, 10, 12, 18, 21 25లో చెప్పబడినవి; కానీ **ఆరవ దినము** యొక్క ముగింపులో ఇవే పదములు, ఆయన యొక్క మహిమ గల సృష్టి యొక్క సంపూర్ణతను ప్రాముఖ్యముగా చూపుట కొరకు, కొద్దిగా మార్చబడినవి. ఇంతకుముందు, "మంచిది" అను పదమును ఆయన చేసిన ఆయా వాటిని గురించి వాడెను; అయితే ఇప్పుడు సార్వాభౌముడైన సృష్టికర్త ఒక అడుగు వెనుకకు తీసి తాను చేసినది యావత్తును చూచెను. ఉత్సాహముతో ఆయన **దానినంతటిని "మంచిది"** అని కాక, చాలా మంచిది అని ప్రకటించెను.

"చాలా మంచిది" అనునటువంటి విధమైన నాణ్యమైన మూల్యాంకనం మానవజాతి యొక్క సృష్టి తరువాత దేవుని ద్వారా మాత్రమే చెప్పబడినది (*'adam*, పురుషుడు మరియు స్త్రీ కలిపి). దేవుడు చేసినదానియంతటిలో మానవులు అత్యున్నత స్థానములో ఉన్నారు. ఏలయనగా, వారు మాత్రమే

సృష్టికర్త యొక్క స్వరూపమును కలిగియుండి భూమిపై ఆయన ప్రతినిధులుగా ఉన్నారు (1:26–28). "చాలా మంచిది" అను అంచనాలో మనిషిని కూడా కలుపుట అనునది, ఆదిలో సృజించబడినట్లుగా, మానవులను గురించి చాలా ఉన్నతమైన దృక్పథము చూపుతుంది మరియు ఇది పురాతన మెసొపొతమియలో మానవుని గూర్చి ఉన్న తక్కువ అభిప్రాయమునకు పూర్తి వ్యతిరేకముగా ఉంటున్నది.

బబులోను యొక్క సృష్టిని గూర్చిన పురాణములో, దేవతలకు రాజైన మార్దూక్ (Marduk), "అతని పేరు మనిషి. నిజాముగా, నేను సంస్కారములేని మనిషిని సృష్టిస్తాను" అని చెప్పి "ఒక సంస్కారములేని దుష్టుని" చేయుటకు నిశ్చయించుకొనెను. ఈ కథలో మనిషి ఒక "సంస్కారము లేని దుష్టునిగా" సృష్టించవలసివచ్చుటకు కారణమేమనగా, అతను అందరికంటే పనికిమాలిన దేవుడైన కింగూ (Kingu) యొక్క రక్తము నుండి సృష్టించబడ్డాడు.[24] పురాతన మెసొపొతమియ యొక్క సాహిత్యము మరియు ఆదికాండము మధ్య ఉన్న బేధము స్పష్టముగా ఉన్నది: అందులో, మానవుడు ఒక సంస్కారము లేని దుష్టునిగా కింగూ (Kingu) అను ఒక సంస్కారము లేని దుష్ట దేవుని నుండి వచ్చాడు. ఈ దేవుడు మార్దూక్ (Marduk) ద్వారా నడిపించబడిన దేవతలాతో జరిగిన యుద్ధములో నశించిపోయెను. కానీ, ఆదికాండములో, మానవుడు–దేవుని పోలికలో చేయబడి–"చాలా మంచిది" అని ప్రభువు ప్రకటించిన సృష్టిలో భాగమైయున్నాడు. మరియు ఆటను పరిశుద్ధుడు మరియు ప్రేమగలిగిన దేవుని ద్వారా సృష్టించబడ్డాడు. ఈ దేవుడు కేవలము మానవుని ఆశీర్వదించవలెనని మరియు అతనితో అన్ని మంచి విషయములు పంచుకొనవలెనని కోరుకొనెను. ఆరు దినములు సృష్టిని గూర్చిన ఆదికాండము యొక్క చరిత్ర ఇదే.

## అన్వయము

### సృష్టికర్తయైన దేవుడు (అధ్యాయము 1)

*దేవునిని సృష్టికర్తగా ప్రకటించుట ద్వారా ఆదికాండము విశ్వాసమునకు ఒక ఆధారము కలుగజేయుచున్నది.* మతము యొక్క తత్వముపై రచించబడిన పుస్తకములలో ఉన్నట్లుగా, ఆదికాండము దేవుని ఉనికిని గూర్చిన సారాంశ వాడములతో ఆరంభము కాదు. దేవుడు ఉన్నాడనియు లేక ఆయన ఈ లోకమును మరియు సమస్త జీవమును సృష్టించెననియు ఋజువు చేయు నిమిత్తము ఎవరైనా ఉపయోగించే శాస్త్రీయమైన సమాచారమును కానీ లేక ప్రయోగములను కానీ ఆదికాండము చూపుతలేదు. పురాతన తూర్పు ఆసియా ప్రాంతమంతటిలో బహుగా ప్రచారములో ఉండిన ఆకర్షణీయమైన అనేకదేవతలతో

కూడిన పురాణగాథలపై నేరుగా దాడి చేయుటతో బైబిలు ఆరంభమవుటలేదు. ఆకాశాములను, భూమిని మరియు అన్ని జీవులను, ప్రత్యేకముగా మనిషిని సృష్టించిన ఏకైక సార్వభౌముడైన దేవుని యందు విశ్వాసమును గూర్చిన ప్రకటనతో అది మొదలవుతుంది. ఏలయనగా ఆయన మంచి దేవుడు మరియు తన సృష్టిని ఆశీర్వదించాలని మాత్రమే ఆయన ఆశిస్తున్నాడు.

కొందరు ఈ విధమును ఒక బలహీనతగా చూడవచ్చు. ఏలయనగా, ఇది విశ్వాసమును ముందు పెట్టి తర్కమును మరియు శాస్త్రీయమైన జ్ఞానమును నిరాకరించుచున్నట్లుగా కనబడుతుంది. ఏదేమైనా, నిజానికి, విజ్ఞాన శాస్త్రము వెనుక దానికి ఆధారముగా ఉన్న గ్రుడ్డి విశ్వాసమును, మానవ తర్కమును, మరియు సహజ సిద్ధమైన ఆధారములేనటువంటి ఊహలను మాత్రమే అది మినహాయిస్తుంది. ఇటువంటివి దేవుని గూర్చి కానీ, సృష్టిని గూర్చి కానీ ఎన్నడూ ఒక నిశ్చయమైన సత్యమునకు రాలేవు. మరో విధముగా చెప్పాలంటే, ఆదియందు గమనించే మానవులెవరూ లేరు కాబట్టి, దేవుడే సమస్తమైన వాటి యొక్క సృష్టికి కారకుడా లేక ఇదంతా కేవలము ప్రమాదవశాత్తు సంభవించెనా అను విషయము శాస్త్రీయముగా ఋజువుపరచబడలేదు. ఒకవేళ ఒక సాక్షి ఉండినా కూడా, శాస్త్రీయ ఋజువు చూపు నిమిత్తము సృష్టిని సృష్టించు ప్రక్రియను మరలా జరిగించుటకు ఎటువంటి అవకాశము లేదు. కనుక, సృష్టి మరియు ఆరంభము అనునవి విశ్వాసమునకు సంబంధించినవై యుండవలెను.

*సృష్టికర్తగా దేవుని యందు విశ్వాసము, ఆకస్మిక సంభవము అనే గుడ్డి విశ్వాసము కంటే ఎక్కువ హేతుబద్ధమైనది.* "ఆదియందు దేవుడు భూమ్యాకాశములను సృజించెను" (1:1; ఉద్ఘాటన కలుపబడెను) అను వాక్యము, ఏ ఋజువు లేని, ఒక విశ్వాసముతో కూడిన ప్రకటన అనునది స్పష్టమే. ఈ కారణమును బట్టి, కొందరు ఎగతాళి చేయుచు, "సృష్టికర్తగా దేవునియందలి మీ విశ్వాసము కేవలము ఏ ఆధారము లేకుండా చీకటిలోనికి దూకుటయే; కనుక, నేను విజ్ఞాన శాస్త్రము పై విశ్వాసమునుంచుతాను, అనగా, దేనినైతే ప్రదర్శించగలమో మరియు ఋజువుపరచగలమో దానిపై విశ్వాసముంచుతానూ" అని అంటారు. ఏదేమైనా, ఒకవేళ ఒకరు దేవునిని సృష్టికర్తగా నిరాకరిస్తే, అప్పుడు సాధ్యపడే ఒకే ఒక్క ప్రకటన ఏమిటంటే, "ఆదియందు అకస్మాత్తుగా భూమ్యాకాశములు కలిగెను" అనునదియే. ఈ రెండూ కూడా విశ్వాసపు ప్రకటనలే; ఇందులో ఏదీ కూడా శాస్త్రీయముగా నిజమని కానీ లేక అబద్ధమని కానీ ఋజువుపరచబడలేదు. కనుక, విషయము విశ్వాసమా లేక జ్ఞానమా (విజ్ఞాన శాస్త్రము) అని కాదు; దీనికి బదులుగా, ప్రశ్న ఏమిటంటే, "ఎటువంటి విధమైన విశ్వాసమును నీవు కలిగి ఉంటావు?" విశ్వసించుటకు ఏది ఎక్కువ తార్కికమైనదిగా మరియు హేతుబద్ధముగా ఉన్నది: క్రమము ప్రమాదవశాత్తు అక్రమము నుండి వచ్చెననియా, జీవము నిర్జీవము నుండి వచ్చెననియా,

మానవుని సచేతనత్వం చైతన్యము లేని పదార్థము నుండి వచ్చెననియా—లేక, ఒక సృష్టికర్త ఈ జటిలమైన విశ్వం మరియు అందులోని జీవరాశిని రూపొందించెననియా? అవిశ్వాసికి ఉన్న సమస్య ఏమిటంటే, జీవము యొక్క ఆరంభమును గూర్చినటువంటి సంఘటన ఏ శాస్త్రీయమైన ప్రయోగము ద్వారా కానీ, ప్రకృతిని గమనించుట ద్వారా కానీ, నిరూపించబడలేదు, మరియు నిరూపించే అవకాశము లేదు. కనుక, ఆకస్మిక సంభవము మీద విశ్వాసమునుంచు వ్యక్తియే నిజానికి తెలియబడిన శాస్త్రీయమైన సత్యమునకు వ్యతిరేకముగా ఉన్న ఆలోచనయందు విశ్వాసముంచుచు, చీకటిలోనికి గ్రుడ్డిగా దూకవలెను.

*ఒక బలహీనమైన పునాదిపై సహజసిద్ధమైన (naturalistic) విశ్వాసము ఆధారపడియున్నది.* ఆకస్మిక సంభవము పై విశ్వాసము యొక్క అశాస్త్రీయమైన స్వభావము ఈ క్రింది విధముగా విశదపరచవచ్చు: ఒకవేళ ఒక వ్యక్తి దగ్గర అనేక లక్షల ఇసుక రేణువులు కలిగియున్న ఒక బకెట్ ఉంటే, ప్రమాదవశాత్తు సమస్తమైన స్వాతంత్రమును ప్రకటించుటను (Declaration of Independence) సరియైన రీతిలో వ్రాయబడుటకు, ఆ బకెట్ లోని ఇసుక రేణువులను అతను ఎన్నిసార్లు నేల మీదికి వేయవలెను? సమాధానము వచ్చుటకే ప్రశ్న వేయబడుతుంది. ఏలయనగా, ఎవరు కూడా నిజానికి ఇది ఎన్నటికైనా జరుగుతుందని అనుకోరు. కాలాంతము వరకు ఇలా చేసినా కూడా ఇది జరుగుతుందని ఎవరూ అనుకోరు. అటువంటిది జరుగుతుందని అనుకొనుటకు అనంతమైన వ్యతిరేకత ఉంది. కేవలము ఆ సంఖ్యలో ఉన్న అన్ని సున్నాలను వ్రాయుట కొరకే ఒక అతిపెద్ద డిక్షనరీ పరిణామములో ఉన్న పుస్తకము కావలసివస్తుంది. ఇటువంటి సంఘటన ఎన్నటికైనా జరుగుతుందని ఎవరూ ఆశించరు; అయితే, సహజ ప్రకృతి విజ్ఞానము పేరిట, కేవలము ఆకస్మిక సంభవము చేతనే విశ్వములోని, సౌరవ్యవస్థలోని, భూమి పైని క్రమము మరియు రూపము – దానిలోని జీవితం యొక్క క్లిష్టమైన రూపములు–వచ్చినవని మనకి చెప్పబడుతున్నది. ఈ గ్రుడ్డి విశ్వాసము ఏమాత్రము తెలివైనది కాదు. ఏలయనగా, మన ఇంద్రియములతో మనము ఈ జీవితములో చూచి అనుభవించే ప్రతి దానికి ఇది విరుద్ధముగా ఉన్నది.

పనికిరాని వస్తువులు ఉన్న ప్రదేశములో ప్రమాదవశాత్తు బాంబు పేలితే ఏమి జరుగుతుంది? దుమ్ము అంతా పోయిన తరువాత, చిన్న చిన్న ముక్కలుగా పడి ఉన్న పనికిరాని వస్తువులు కాకుండా, ఒక పరిపూర్ణమైన కంప్యూటర్ మరియు మానిటర్ అక్కడ ఉంటే ఎలా ఉంటుంది? మరింత జాగ్రత్తగా పరిశీలించినప్పుడు, దానిలో చాలా పెద్ద హార్డ్ డ్రైవ్ మరియు మెమరీ, మరియు ఆపరేటింగ్ సిస్టమ్, ఇంకా అనేకమైన క్లిష్టమైన ప్రోగ్రామ్స్ ఉంటే ఎలా ఉంటుంది? ఈ పనికిరాని వస్తువుల దొడ్డి యొక్క యజమానిని ఇవన్నీ గమనిస్తున్న ఒక వ్యక్తి "ఆ

కంప్యూటర్ ఎక్కడనుండి వచ్చింది? దానిని ఎవరు చేసారు? అది అక్కడికి ఎలా వచ్చింది?" అని అడిగితే, ఆ యజమాని, "అది ఇక్కడికి ఎలా వచ్చిందో నాకు తెలీదు. దానిని ఎవరైనా చేశారనే ఆధారము ఏదీ నాకు కనబడుటలేదు. అది బహుశ, విస్ఫోటనమునకు ప్రతిఫలముగా, ప్రమాదవశాత్తు జరిగి ఉండవచ్చు" అని సమాధానము చెబితే, ఆటను ఆ యజమానుని ఖచ్చితముగా నమ్మడు. మరియొకసారి, ఇటువంటి విస్ఫోటనములు ప్రపంచమంతటిలో ఉన్న అన్ని వ్యర్థ వస్తువులు ఉండు స్థలములలో కాలాంతము వరకు జరిగినా కూడా, ఏ హేతుబద్ధమైన వ్యక్తి కూడా ఇటువంటిది జరుగుతుందని అనుకొనడు. నియంత్రణ లేని అవ్యవస్థత నుండి ఎన్నడూ అధునాతనమైన క్రమము రాలేదు. దీనికి బదులుగా, తెలివైన రూపకల్పన మరియు శ్రద్ధతోకూడిన నిర్మాణము నుండియే ఇది వస్తుంది. కంప్యూటర్ మరియు దాని ప్రోగ్రామ్స్ విషయములో కానీ, లేక భూమ్యాకాశముల, వాటి సమస్త జీవరాశుల విషయములో కానీ ఇది సత్యమే.

"నీవు నన్ను కలుగజేసిన విధానము చూడగా భయమును ఆశ్చర్యమునను నాకు పుట్టుచున్నవి" అని కీర్తనాకారుడు ధ్యానించెను (కీర్తనలు 139:14). ఏదేమైనా, 1990లలో శాస్త్రవేత్తలు మానవ జీనోమ్ (genome) యొక్క మూడువందల కోట్ల కోడ్స్ ని కనుగొనే వరకు ఈ మాటలు ఎంత వాస్తవమైనవో అను విషయమును ఎవరూ పూర్తిగా ఊహించలేకపోయిరి. ఒక మానవుని జీవితము తల్లి యొక్క గర్భములో ఒక్క సారవంతము చేయబడిన కణముతో మొదలవుతుంది. కణము యొక్క సంక్లిష్టత మరియు ప్రతి కణములో పొందుపరచబడిన సమాచారము యొక్క ఊహింపశక్యముకాని మొత్తము మైక్రోసాఫ్ట్ కార్పొరేషన్ వ్యవస్థాపకుడైన బిల్ గేట్స్ ని ఈ విధముగా ప్రకటించుటకు ప్రేరేపించినవి: "DNA అనునది ఒక సాఫ్ట్ వేర్ ప్రోగ్రామ్ వంటిదే కానీ, మనము కనిపెట్టిన దేనికంటే కూడా ఎంతగానో క్లిష్టతరమైనది."[25] ఏదేమైనా, ఒక ప్రవీణుడైన కంప్యూటర్ ప్రోగ్రామర్ యొక్క తెలివైన రూపకల్పన ద్వారా కాకుండా, ఎంతో క్లిష్టమైన ఒక కంప్యూటర్ ప్రోగ్రాం, దానంతట అది యాదృచ్ఛికంగా తయారైందని ఎవరు నమ్మరు కాని అతి క్లిష్టమైన సెల్ యొక్క నిర్మాణము యాదృచ్ఛికంగా జరిగిందని నమ్మేవారు, అది ఎలా జరిగిందో కూడా వివరించలేకపోతున్నారు. వాస్తవానికి, జీవము యొక్క ఉనికి మరియు కణములోని DNA యొకాక్ క్లిష్టతను వివరించగల సహజ మూలకం ఏమిటో శాస్త్రవేత్తలు ఐదు దశాబ్దాలుగా వెదుకుచున్నప్పటికీ ఇంతవరకూ జీవము యొక్క ఆవిర్భావమును ధృవీకరించే ఎటువంటి ఆధారమును కనుగొనలేదు.[26] వారు నిరీక్షణకు వ్యతిరేకంగా నిరీక్షించి ఏదో ఒక రోజు "ఆదియందు యాదృచ్ఛికంగా భూమ్యాకాశములు కలిగెను" అని చెప్పగలుగుతామనుకుంటున్నారు. సృష్టికర్తయందు వారు విశ్వసించకుండుటకు కారణము జీవముయొక్క స్వభావము మరియిఉ దాని ఆవిర్భావమునకు సరియైన ఋజువులు లేకపోవడం కాదు కాని, "చూడని వానికంటే గ్రుడ్డివాడు

మరొకడుండడు” అనే సామెత మాదిరిగా వారు జీవిస్తున్నారు.

**ఆదియందు దేవుడు మరియు ఆయన ఉద్దేశము (అధ్యాయము 1)**

*సృష్టికి పూర్వమే దేవుడు క్రీస్తునందు ఒక ఉద్దేశము కలిగియున్నాడు.* ఆదికాండము యొక్క రచయిత “ఆదియందు” అనే మాటను రాసినప్పుడు “ఆది”కి ముందు తండ్రియైన దేవుడు తప్ప మరేది ఉనికిలో లేదని అతని భావం కాదు. సిలువ నీడలో యేసు, తండ్రికి ప్రార్థించి చివరిలో, “జగత్తు పునాది వేయబడకమునుపే నీవు నన్ను ప్రేమించితివి” (యోహాను 17:24) అని ముగించారు. “ఆదియందు” అనే మాట, ముందున్న నిత్యత్వమును సూచిస్తున్న విషయాన్ని ఇది మనకు ప్రత్యక్షపరుస్తుంది. అపొస్తలుడైన పౌలు క్రైస్తవులను గురించి మాట్లాడేటప్పుడు, “జగత్తు పునాది వేయబడకమునుపే, ప్రేమచేత ఆయన [దేవుడు] క్రీస్తులో మనలను ఏర్పరచుకొనెను” (ఎఫెస్సీ. 1:4). కనుక, ఆదికి పూర్వమే ఒక నిశ్చలమైన స్థితికంటే వేరైనది ఉనికిలో ఉండినది. ఒక నిర్ణయము చేయబడి, అది మన తరఫున క్రీస్తుద్వారా దేవుని చిత్తము మరియు ఆలోచన కలిగినదైయున్నది.

*సృష్టికి పూర్వమే దేవుడు తన ప్రేమ మరియు ఉద్దేశములను క్రీస్తు సిలువ ద్వారా మనకు వ్యక్తపరచాలని సంకల్పించారు.* దేవుడు స్త్రీని, పురుషుని నిర్మించి వారికి స్వేచ్ఛా చిత్తమును ఇవ్వకమునుపు వారు తప్పనిసరిగా తప్పుడు నిర్ణయాలు తీసుకొని పాపం చేస్తారని, ఆ కారణము చేత వారికి క్షమాపణ మరియు రక్షకుడు అవసరము అవుతాడని ఆయనకు తెలుసు. “మానవ జాతి తప్పనిసరిగా పాపం చేసి తమకు తాము మరియు యితరులకు హాని కలిగిస్తారని, అలాగే ఆయన హృదయాన్ని గాయపరుస్తారని ముందుగానే దేవునికి తెలిసుంటే ఆయన మానవులను స్వేచ్ఛా చిత్తముతో ఎందుకు సృజించారు?” అని కొన్నిసార్లు ప్రజలు అడుగుతుంటారు.

మానవజాతిని గురించి కూడా ఇదే ప్రశ్న అడుగవచ్చు: భార్యభర్తలకు వారు జన్మనిస్తున్న చిన్న బిడ్డలు ఒక దినాన పెద్దవారై తమకు అవిధేయులౌతారని, ఒకవేళ వారి హృదయాన్ని గాయపరచవచ్చని తెలిసికూడా పిల్లలకు ఎందుకు జన్మనిస్తున్నారు? దేవునికి మరియు మానవజాతికి అవిధేయులైన పిల్లలు లేకుండా ఉండాలంటే పిల్లలను కాకుండా ముందుగా ప్రోగ్రాం చేయబడి ఎటువంటి ఫిర్యాదులు లేకుండా చెప్పింది చెప్పినట్లు చేసుకుంటూపోయే యాంత్రిక మానవులను తయారు చేయడం ఒక్కటే మార్గం. అటువంటి నిర్జీవమైన, భావోద్వేగరహిత ప్రపంచంలో నివసించాలని ఎవరూ ఆశించరు; అలాగే, అటువంటి సృష్టి చేయతగినది అని దేవుడు కూడా ఆశించియుండడు. దేవుడు ఆయన స్వరూపంలో, స్వేచ్ఛా చిత్తమును కలిగిన మానవులు ఉన్న లోకమును సృజించారు (1:26, 27).

మానవులు పాపం చేస్తారని, వారికి రక్షకుని అవసరత ఉందని సృష్టిని చేయకముందే దేవునికి తెలుసు. కాలం సంపూర్ణమైనప్పుడు తన కుమారుడు సిలువలో మరణించి మన పాపముల కొరకు తగిన వెలను చెల్లించుటకు ఈ లోకానికి పంపుట ద్వారా దేవుడు తన ప్రేమ యొక్క అత్యున్నత ప్రదర్శనను అనుగ్రహించుటకు ఉద్దేశించాడు (యోహాను 3:16). యేసు మరణమును పునరుద్ధానమును చూచిన తరువాత, వారి సమక్షంలో చేయబడిన అవివాద అద్భుతాలు, ఆశ్చర్యక్రియలు మరియు సూచకక్రియలద్వారా నజరేయుడైన యేసును దేవుడు వారికి ఋజువు పరచాడని పేతురు పెంతెకొస్తు దినాన యూదులకు జ్ఞాపకం చేశాడు. తరువాత, "దేవుడు నిశ్చయించిన సంకల్పమును మరియు పరలోకమునకు ఆరోహణమగుటకును సాక్షులమని, అక్కడ ఆయన "ప్రభువుగాను క్రీస్తుగాను" (అపొ. 2:22–24, 32–36) పరిపాలిస్తున్నాడని తెలియజేసాడు.

హంతకుల చిత్తానికి వ్యతిరేకంగా వారిని బలవంతపెట్టి యేసును చంపేలా దేవుడు చేసాడని దీని భావం కాదు. దుష్టులైన మానవులు తన కుమారుని తృణీకరిస్తారని దేవునికి ముందుగానే తెలుసని దీని భావం. యేసుయొక్క మరణం కేవలం ఒక అత్యంత విచారకరమైన విషాదకరమైన యాదృచ్ఛికమో కాదు; కాని, అది త్యాగపూరితమైన మరణం మరియు అది "జగత్తు పునాది వేయబడక మునుపే నియమింపబడెను [destined; NRSV]" (1 పేతురు 1:20). అదేవిధంగా, "మన క్రియలనుబట్టి కాక తన స్వకీయ సంకల్పమునుబట్టియు, అనాదికాలముననే క్రీస్తుయేసునందు మనకు అనుగ్రహింపబదినదియు ... మనలను రక్షించి పరిశుద్ధమైన పిలుపుతో ఆయన మనలను పిలిచెను" (2 తిమోతి 1:9) అని పౌలు రాసాడు. జగత్తు పునాది వేయబడక మునుపే–నిత్యత్వములో తప్పనిసరిగా ఏదో ఉంది–అది నిర్జీవమైనది లేదా వ్యక్తిత్వంతో సంబంధం లేనికి కాదు. దీనికి విరుద్ధముగా, రక్షకుడును ఆయన కుమారుడునైన యేసుక్రీస్తు ద్వారా తన ప్రేమను, దయను మానవులపై కుమ్మరించాలనేది దేవునియొక్క వ్యక్తిగత సంకల్పం (యోహాను 3:16). యేసును ప్రభువుగా అంగీకరించుటకు లేదా తిరస్కరించుటకు మానవునికి స్వేచ్ఛా చిత్తము యివ్వబడింది. సువార్త యందు విశ్వసించుట, మన పాపముల నిమిత్తం పశ్చాత్తాపము చెందుట, క్రీస్తు దేవుని కుమారుడని ఆయనయందలి విశ్వాసమును ఒప్పుకొనుట, ఆయన విమోచనకరమైన రక్తములోనికి బాప్తీస్మము పొందుట మరియు ఆయనను రక్షకునిగా ధరించుకొనుటద్వారా మనం రక్షింపబడతాము (రోమా 10:9–13; గలతీ. 3:27; 1 పేతురు 1:18, 19).

*వ్యక్తిగా ఉన్న దేవుడు మాత్రమే మానవజాతికి ఉద్దేశము మరియు అర్థమును ఇవ్వగలడు.* దేవుడు ఒక వ్యక్తిత్వంతో సంబంధంలేని శక్తి కాదు అనేది సువార్త యొక్క శుభవార్తలోని భాగము: గ్రీకు తత్వం బోధిస్తున్నట్లు, దేవుడు

నిశ్చలమైనవాడై కదిలించగలిగినవాడు లేదా మూలములన్నిటికి మూలమై ఎటువంటి కోరికలు, భావోద్వేగాలు, బాధ్యతలు, ప్రేమ లేదా మానవుని పట్ల ఒక ఉద్దేశము లేనివాడు కాదు; లేదా, ప్రాచ్యత బహుదేవతా మతములవారు (pantheistic Eastern religions) నమ్మి, వ్యక్తిత్వములేనట్టి సజీవము లేక నిర్జీవముగల, ఉనికిలో ఉన్నవన్నీ దేవునిగా గుర్తించుట అని కాదు. కాని, అన్నింటిని, అందరిని–ప్రత్యేకంగా తన స్వరూపంలో చేయబడిన మానవుణ్ణి సృజించిన వ్యక్తియైయున్నవాడు దేవుడు. కొందరు ఎంతమాత్రమూ ప్రేమింపదగని వారైయున్నప్పటికీ ప్రతి వ్యక్తిని ప్రేమించువాడు దేవుడు. ఒక వ్యక్తియైయున్న దేవుడు మాత్రమే మానవుని యొక్క వ్యక్తిత్వమును వివరించి, ఆయన స్వరూపంలో చేయబడిన వ్యక్తిగా అతనికి ఆత్మగౌరవమును ఇవ్వగలడు. మానవ సంబంధములను అర్థము చేసికొనుటకు మరియు ఇతరులు కూడా దేవుని స్వరూపమును కలిగియున్నారు గనుక, వారిని ప్రేమ మరియు గౌరవములతో చూచుట కొరకు, ఇది ఆధారము కలుగజేయుచున్నది.

సృష్టికి ఒక ఉద్దేశము ఉన్నది, అలాగే మానవజాతి ఒక గురివైపు నడుచుచున్నది. దేవుడు ఒక దినాన సమస్తమును క్రీస్తునందు సమకూర్చుతాడు (ఎఫెస్సీ. 1:10). "తాను జరిగించిన క్రియలచొప్పున, అవి మంచివైనను సరే చెడ్డవైననూ సరే, దేహముతో జరిగించిన వాటి ఫలమును ప్రతివాడును పొందునట్లు" క్రీస్తు న్యాయపీఠము ఎదుట మనమందరము ప్రత్యక్షమగుట మన అందరికి నియమింపబడిన గమ్యము (2 కొరింథీ. 5:10).

*మానవులను విమోచించాలనే దేవుని సంకల్పం మానవునియొక్క స్వేఛ్ఛాపూర్వకమైన ప్రతిక్రియ పై ఆధారపడి ఉంటుంది.* రక్షణ అనేది బేషరతుగా ముందుగానే నిర్ణయించబడలేదు. "ఎవడును నశింపవలెనని యిచ్ఛయింపక, అందరు మారుమనస్సు పొందవలెనని" దేవుడు కోరుచున్నాడు (2 పేతురు 3:9). ఆయన, "మనుష్యులందరును రక్షణపొంది సత్యమును గూర్చిన అనుభవజ్ఞానముగలవారై యుండవలెనని యిచ్ఛయించుచున్నాడు"; నిర్దిష్టముగా, మన పాపముల విమోచన క్రయధనము యేసు ఒక్కడే అను సత్యమును అందరూ తెలుసుకొనవలెనని ఆయన కోరిక (1 తిమోతి 2:4–6). అందరిని ఆయన యొద్దకు రమ్మని క్రీస్తు పిలుచుచున్నాడు (మత్తయి 11:28) కాని, ఆ విధముగా చేయుటకు ఆయన ఎవరిని బలవంతపెట్టడు. క్రీస్తునందు నూతన సృష్టియగు నిమిత్తము, ప్రభువునందు విశ్వాసముతో మరియు ఆయన చిత్తమునకు విధేయతతో స్పందించుటకు, సువార్తను విను ప్రతి వ్యక్తి అవకాశము మరియు బాధ్యత ఉన్నది (మార్కు 16:16; యోహాను 3:3–5; అపో. 2:38–40; 2 కొరింథీ. 5:17).

## మానవునిలోని దేవుని స్వరూపమునకు ఋజువు (1:26–28)

మానవునిలో ఉన్న దేవుని స్వరూపమును నిర్వచించుటకు తగ రెండువేల సంవత్సరాలుగా దైవశాస్త్రపండితులు ఎంతగానో శ్రమించారు కాని, వారంతా అందరికీ ఆమోదయోగ్యమైన ఒక సార్వత్రిక వ్యాఖ్యానం విజయవంతముగా చేయలేకపోయారు. మానవుడు ఈ ప్రపంచంలో ఒక ప్రత్యేకమైన జీవి, మరియు దేవుని స్వరూపంలో సృజించబడినవానిగా అతనిలోని వైవిధ్యమైన గుణగణములు మిగిలిన జంతువులనుండి అతనిని ప్రత్యేకపరుస్తున్నాయి.

*కేవలం మానవునికి మాత్రమే భూమిపై మరియు జంతుజాతిపై ఆధిపత్యం (ఏలుబడి) ఇవ్వబడింది.* దేవుడు మానవుని సృజించినప్పుడు, దేవుడు అతనికి జంతురాశిపై ఏలుటకు అధికారమిచ్చాడు. కాని అతడు దేవుని చేతి క్రింది గృహనిర్వాహకునిగా ఒక పవిత్రమైన బాధ్యతాను కలిగియున్నాడు. మానవుడు రెండు ప్రపంచముల మధ్య జీవిస్తున్నాడు: భౌతికమైనది మరియు ఆత్మీయమైనది. జంతువులవలె, మట్టితో నిర్మించబడి పోషించబడవలసిన శరీరము అతనికి యివ్వబడింది. అతనికి కూడా గాలి, నీరు మరియు పోషకపదార్థములు కావాలి; కాని, దేవుని స్వరమును విని తన పట్ల దేవుని ఆలోచనలు ఏమైయున్నవో ఆలోచించగలిగినవాడు మానవుడు మాత్రమే (కీర్తనలు 8:3–9 చూడండి).

కనుక, జంతురాశిపై మానవుని ఆధిపత్యము భౌతికమైనదానికంటే మరింత ఆత్మీయమైనదిగా ఉంటుంది. అది పరిమాణం కంటే నాణ్యతను సూచించేదిగా ఉంది. నీటితిమింగలానికి ఉన్నంత ఎక్కువ పరిమాణంలో మానవునికి మెదడు లేదు. సింహము వంటి బలముగాని, చిరుత వంటి వేగముగాని అతనికి లేవు. అతని కనుదృష్టి పక్షిరాజు అంత గొప్పది కాదు. స్పష్టంగా చెప్పాలంటే, జంతువులపై మానవుని ఔన్నత్యము భౌతిక విషయములో కొలవదగ్గది కాదు; దీనికి బదులుగా, మానవుని ఔన్నత్యం దేవుడు ప్రతి వ్యక్తిలో ఉంచిన ఒక ఆత్మీయ నాణ్యతయైయున్నది.

*మానవుడు మాత్రమే తనకు మించినవానిగా ఉండగలడు.* జంతువులు కేవలం ఆలోచించగలవు కాని, మానవుడు తనను తానే మించిపోయి ఆలోచించుటను గూర్చి కూడా ఆలోచించగలడు. "నేనెవరిని?"; "నేను ఎక్కడనుండి వచ్చాను?"; "నేను ఇక్కడ ఎందుకున్నాను?" అనే గొప్ప ప్రశ్నలు మానవుడు మాత్రమే అడుగగలడు. మానవుడు మాత్రమే తన గుర్తింపును గూర్చిన ప్రశ్నలు అడుగుకొని, తన మూలములు, తన జీవితము యొక్క ఉద్దేశమును వెదుకగలడు. ఈ విషయాల గురించి జంతురాశి ఎంతమాత్రము శ్రమించదు. అవి కేవలం ఆ దినం కొరకే బ్రతుకుతాయి.

*అనుభవము నుండి నేర్చుకొని, జ్ఞానమును సమకూర్చుకొని తరువాతి*

*తరములవారికి దానిని అందించు సామర్థ్యత కేవలం మానవునికే ఉంది.* జీవులన్నింటిలో మానవునికి మాత్రమే గతము (చరిత్ర) ప్రాముఖ్యమైనది. తరువాత వచ్చే ప్రతి తరము వారు తమకంటే జ్ఞానవంతులుగా ఉండుటకు గాను అతడు గతమునుండి విషయములను సమకూర్చుకొని వాటిని తరువాతి తరములవారికి అందజేస్తాడు. తన కుమారులు మరియు మనుమలు ప్రతి విషయాన్ని తమంతట తాము కనుగొని అవసరత లేకుండా మానవుడు మాటపూర్వకంగాను, వ్రాతపూర్వకంగాను తన జ్ఞానమును భద్రపరచగలడు.

*మానవుడు మాత్రమే జీవితమూ యొక్క భౌతిక విషయములను బట్టి విరామము లేకుండా శ్రమ పడుతున్నాడు.* ఇది కొంతవరకు నిజమే, ఎందుకంటే దేవుడు "శాశ్వతకాల జ్ఞానమును నరుల హృదయమందుంచి యున్నాడు" (ప్రసంగి 3:11). (1) మానవుడు తాను కలిగియున్న భౌతిక వస్తువులచేత ఎన్నడూ తృప్తి చెందడు. కాని, కేవలం జీవన సంబంధమైన సాధారణం అవసరతలు తీరితే జంతువులు సంతోషిస్తాయి. (2) మానవుడు ఎన్నడూ తానెవరో, ఎలా ఉన్నాడో, ఏమి ఎరిగియున్నాడో, ఏమి అనుభవిస్తున్నాడో, ఏమి సాధిస్తున్నాడో దానినిబట్టి తృప్తిచెందడు. క్రొత్త విషయాలను ఎల్లప్పుడూ చూడాలని, వినాలని, అనుభవించాలని జంతువులు ఆశించవు. అలాగే, వాటి చుట్టూ ఉన్న ఇతర జంతువులకంటే మరింత విజయవంతంగా జీవించాలనే తపన వాటికుండదు. ఎటువంటి కార్యకలాపాలు లేని అత్యంత సాధారణమైన, మానవులకు విసుగు కలిగించే, జీవనంతో అవి సరిపెట్టుకుంటాయి. (3) నూతన గమ్యాలకు తీసుకొని పోయే సాహసపూరితమైన మనసు మానవునికుంది. తరువాత పర్వత సముదాయం, మహాసముద్రాలకు ఆవల ఏముందో మానవుడు తెలుసుకోవాలని ఆశిస్తాడు కాని అంతటితో ఆగడు. చంద్రునిపై ఏముంది, ఇతర గ్రహములపై మరియు సుదూరాన ఉన్న పాలపుంతలలో ఏముంది అని కూడా తెలుసుకోవాలనుకుంటాడు. జంతువులకు ఇటువంటి విషయాలపై ఆసక్తి ఉండదు; ఇతర ఖండాలు, దేశాలు లేదా ప్రపంచాల గురించి ఆలోచించే శక్తి వాటికి లేదు. తనకు తెలియకుండానే సంపూర్ణత మరియు పరిపూర్ణతల కొరకైన అన్వేషణలో తనలోని దేవుని స్వరూపమునకు మానవుడు సాక్ష్యమిస్తున్నాడు. అతడు పరిమితి కలిగిన కాలము కొరకు కాక అపరితమైన నిత్యత్వము కొరకు మరియు అనంతుని కొరకు అనగా దేవుని కొరకు సృజించబడియున్నాడు. "నీవు మమ్మును నీ కొరకు నిర్మించియున్నావు, నీయందు విశ్రాంతి కనుగొనేవరకు మా ఆత్మ నెమ్మదితో ఉండదు" అని Augustine రాశాడు.[27]

*మానవుడు ఒక్కడే బాధ్యతాయుతమైన మనసు కలిగిన నైతికజీవి.* తప్పొప్పులతో పోరాడుచూ నేరారోపణ కలిగిన మనస్సాక్షితో జీవిస్తాడు (యోహాను 8:7–11; రోమా. 2:12–16; 1 కొరింథీ. 8:7–13; 1 తిమోతి 1:19; 3:9; 4:2; 1 పేతురు 3:16–21). ఒక బిడ్డ జన్మించినప్పుడు నూతనముగా జన్మించిన ఈ

బిడ్డ ఒకనాటికి ఏమౌతాడో లేక ఏమి చేస్తాడో తల్లిదండ్రులకు తెలియదు. ప్రతి బిడ్డ, "నా జీవితంలో నేనేమి చేయాలి?" అనునటువంటి ప్రశ్నలతో ఎదుగుగడు. జంతువులైతే వాటి సహజగుణాలకు అనుగుణంగా జీవిస్తాయి; వాటి విధి వాటికి ఇవ్వబడియున్నది మరియు దానిని అవి సహజముగా నెరవేర్చుతాయి. ఒక పిల్లి పుట్టినప్పుడు అది ఏమౌతుందో మరియు ఏమి చేస్తుందో మనకు తెలుసు: అది పిల్లివలె జీవించి పిల్లులకు సహజమైనదేదో అదే జరిగిస్తుంది. "ఇలా ఉండాలా? ఉండకూడదా?" అనే Hamlet ప్రశ్న మానవులకే తగినది.[28] తన జీవితం ఏ దిశలో పయనించాలో మరియు ఎటువంటి జీవితం తాను జీవించాలో నిర్ణయించుకొనే సామర్ధ్యత కేవలం మానవులకే ఉంటుంది. మానవుడు ఔన్నత్యం, ప్రేమ మరియు నీతి కలిగి యుండుటకు నిర్ణయించుకోవచ్చు; లేదా, అగౌరవంగా, స్వార్ధపూరితంగా మరియు దుష్టభావంతో జీవించాలని నిర్ణయించుకోవచ్చు. జంతువులు నైతిక జీవులు కావు కనుక ఇటువంటి నిర్ణయాలు తీసుకునే సామర్ధ్యత వాటికి ఉండదు.

*కళలు, చిత్రలేఖనం, కావ్యములు మరియు శిల్పకళలు వంటివాటిని చేయుటకు మానవునికి మాత్రమే కళాసౌందర్యాత్మకత ఇవ్వబడింది.* తన జీవనమునకు అత్యవసరము కానిదాని కొరకు వారములు మరియు నెలలతరబడి పనిచేయు జీవి మానవుడు ఒక్కడే. సృజనాత్మకత అనేది, మానవుడు వేలాది సంవత్సరాలుగా తన జీవనానికి సహరించే విషయాలను వృద్ధిలోనికి తెచ్చుకొని జీవనానికి ఉపకరించని విషయాలను వదిలిపేశాడని నమ్మే కళాసౌందర్య పరిణామ నమూనాకు భిన్నమైనది. మానవుని విషయంలో ఇది జరగలేదు; తనలోని కళాసౌందర్యాత్మకతను విడిచిపెట్టుటకు బదులు, అది కాలానుగుణంగా మరింత వివరణాత్మకంగా మారింది. జంతువుల జీవన శ్రేయస్సుకు కళాసౌందర్యత పనికి రాదు కనుక అవి ఈ విషయాన్ని పట్టించుకోవు. తన గూడు కట్టుకొనుటకు ఉపయోగపడుతుంది కనుక ఒక పక్షి అందమైన దారపు ముక్కను తెచ్చుకుంటుంది. బీవర్ (beaver—ఎలుకవంటి ఉభయచర జీవి: అడవుల్లోని చిన్న సెలయేళ్ళకు అడ్డంగా దుంగలతో వంతెనలు కట్టడానికి ప్రసిద్ధిపొందింది) అనే జంతువు తన బలమును పనితనమును నిలుపుకొనుటకు ఆనకట్టలు కట్టే ప్రవృత్తిని కలిగియుంటుంది. పటిష్టత మరియు రూపకల్పనలతో అందమైన లోకమును సృజించిన దేవుడు మానవుని సృజించి, మంచి రంగులు, రూపములు, ఆకారములు మరియు అమరికలతో కూడిన సౌందర్యము మరియు సౌష్టవములతో తన పరిసరములను నిర్మించుకోవాలనే కోరికను అతనిలో పెట్టాడు. ఇటువంటి ఆశీర్వాదంలో, మానవుడు తన సంతృప్తిని దేవునిలో కాకుండా సౌందర్యంలో వెదకుటకు ప్రారంభించే ఊక ముప్పు ఉంది. పూర్వమందు ఉండిన "ప్రసంగి" వలే (ప్రసంగి 1:1, 8; 2:1–11). ఈ ఉచ్చులో పడిపోయినవాడు సంతోషము, సంతృప్తిని కనుగొనుటకు బదులు నిరాశను, వ్యర్థతను ఎదుర్కొంటాడు.

*మరణానంతర జీవితమును గూర్చిన భావన మానవునికి మాత్రమే కలదు.* చనిపోయినవారిని పాతిపెట్టేది మానవుడు ఒక్కడే. చింపాంజీలు మరియు ఏనుగులు తమలో చనిపోయినవాటిని పాతిపెడతాయనే కొన్ని పొడికథలు ఉన్నప్పటికీ, అది వాస్తవమని నిరూపించే ఏ హక్కు శాస్త్రీయమైన ఋజువు ఇంతవరకు లేదు. జంతువులు మరణాన్ని ఎదుర్కొని, కొంతవరకు దానికి భయపడుతూ, దాని గురించి బాధపడినట్లు కనిపించినప్పటికీ, మరణము కొరకు తమను తాము ఎంతమాత్రం సిద్ధపరచుకొనవు. మానవునిలో ఉన్న ఏదో ఒకటి మరణము యొక్క పవిత్రతను సూచిస్తుంది. మానవుడు దీనిని విలువైనదిగా చూస్తాడు కానీ ముగింపుగా కాదు; దీనిని తాళుకోవాలని ఆశిస్తాడు (2 సమూ. 12:19–23; కీర్తనలు 23:4–6). పురాతన సమాజాలలో, తమవారిని పాతిపెట్టేటప్పుడు తరువాతి లోకం కొరకు ఉపయోగకరమైన లేదా విలువైన వస్తువులను వారివెంట పాతిపెట్టేవారు. దేవుడు మానవుని హృదయంలో శాశ్వతకాలజ్ఞానమును ఉంచాడనుటకు ఇది ఋజువు (ప్రసంగి 3:11).

దేవుడు మానవుని అద్వితీయునిగా సృజించారు. ఈ అద్వితీయత యొక్క ఆశీర్వాదము, సృష్టికర్తను సేవించుట మరియు స్తుతించుట అను ప్రత్యేకమైన బాధ్యతతో ముడిపడి ఉంది.

---

సూచనలు

[1]అతి కొద్ది అనువాదములు మాత్రమే మొదటి వచనమును ఆధారిత వాక్యముగా చూస్తాయి (NAB; NEB; NJPSV; NRSV; TEV). మరింత సమాచారము కొరకు Victor P. Hamilton, *The Book of Genesis: Chapters 1–17,* The New International Commentary on the Old Testament (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1990), 103–8 చూడుము. [2]Terence E. Fretheim, "The Book of Genesis," in *The New Interpreter's Bible,* vol. 1, ed. Leander E. Keck (Nashville: Abingdon Press, 1994), 342. [3]W. H. Schmidt, "ברא," in *Theological Lexicon of the Old Testament,* trans. Mark E. Biddle, ed. Ernst Jenni and Claus Westermann (Peabody, Mass.: Hendrickson Publishers, 1997), 1:255. [4]*The Creation Epic* 4.1–146. [5]R. Laird Harris, "תְּהוֹם," in *Theological Wordbook of the Old Testament,* ed. R. Laird Harris, Gleason L. Archer, Jr., and Bruce K. Waltke (Chicago: Moody Press, 1980) (hereafter cited as *TWOT*), 2:966. [6]Francis Brown, S. R. Driver, and Charles A. Briggs, *A Hebrew and English Lexicon of the Old Testament* (Oxford: Clarendon Press, 1962), 956. [7]J. Barton Payne, "רָקִיעַ," in *TWOT,* 2:862. [8]*The Creation Epic* 4.137–140. [9]H. L. Ginsberg, trans., "Poems about Baal and Anath," in *Ancient Near Eastern Texts: Relating to the Old Testament,* 3d ed., ed. James B. Pritchard (Princeton, N.J.: Princeton

University Press, 1969), 129–42. [10]Beth-shemesh అనగా "సూర్య-మందిరము" (Brown, Driver, and Briggs, 112). అలాగే, యెరికో అను పేరు కూడా "చంద్రుడు" అను పదము గల అదే మూలము నుండి వస్తుంది (Hamilton, 127–28, n. 4).

[11]Brown, Driver, and Briggs, 1056. [12]Ibid., 1072. [13]John T. Willis, *Genesis,* The Living Word Commentary (Austin, Tex.: Sweet Publishing Co., 1979), 87. [14]H. C. Leupold, *Exposition of Genesis*, vol. 1 (n.p.: Wartburg Press, 1942; reprint, Grand Rapids, Mich.: Baker Book House, 1953), 86–87. [15]ఉదాహరణకు, మత్తయి 3:16, 17; 28:19; యోహాను 1:1–3; 10:30–33; 20:28; అపొ. 5:3, 4; రోమా. 8:9–17, 26–29; 2 కొరింథీ. 13:14; ఎఫెసీ. 3:16–19; ఫిలిప్పీ. 2:5–11; కొలస్సి. 1:15–17; హెబ్రీ. 1:1–3; యూదా 20, 21; ప్రకటన 5:8–14. [16]యోబు 1:6లో మరియు 2:1లో ఉన్న "దేవుని కుమారులు" ఆయన ముందుకు వచ్చిన దేవుని దూతలు. సాతాను కూడా వారిలో ఒకడు. [17]John E. Hartley, "צֶלֶם," in *TWOT*, 2:767. [18]John N. Oswalt, "רָדָה," in *TWOT*, 1:430. [19]Hamilton, 139–40. [20]William White, "רָדָה," in *TWOT*, 2:833.

[21]*The Creation Epic* 6.8, 36. [22]*The Epic of Gilgamesh* 11.161. [23]Derek Kidner, *Genesis: An Introduction and Commentary*, The Tyndale Old Testament Commentaries (Downers Grove, Ill.: Inter-Varsity Press, 1967), 52. [24]*The Creation Epic* 6.29–33. [25]L. D. Virgilio, *DNA vs. Evolution: The Little Code That Confirms the End of Evolution* (Bloomington, Ind.: Author House, 2009), 107. [26]Lee Strobel, *The Case for a Creator* (Grand Rapids, Mich.: Zondervan, 2004), 226. [27]Augustine *Confessions* 1.1.1. [28]William Shakespeare *Hamlet* 3.1.55.